జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

కృష్ణ | గురువారం 20 ఆగస్టు 2026 | సంపుటి : 01 | సంచిక :217 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



జెన్ జీపై మోదీ సర్కార్

## ఫోకస్

- ప్రతి రోజూ ఓ యూనివర్సిటీకి ఒక కేంద్ర మంత్రి!
- నీట్ పేపర్ లీక్ నిరసనల నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం
- వన్ డే వన్ యూనివర్సిటీ పేరుతో సరికొత్త మాస్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌కు ప్లాన్
- యువత సవాళ్లు, ఆకాంక్షల్ని నేరుగా తెలుసుకోనున్న మోదీ ప్రభుత్వం



## మోదీ ప్రభుత్వం యువత భవిష్యత్తును దెబ్బతీస్తోంది

- విద్యార్థుల భవిష్యత్తును మోదీ సర్కార్ నాశనం చేసింది
- యువత కోసం కొత్త రోడ్‌మ్యాప్ కావాలి
- మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు

వైఎస్సార్సీపీ హయాంలో గ్రూప్-1 నిర్వహణ

# అతిపెద్ద స్కామ్



- డ్రైవర్లు, ప్లంబర్లతో పేపర్లు దిద్దించారు: చంద్రబాబు
- గ్రూప్-1 నియామకాల్లో భయంకరమైన అక్రమాలు జరిగాయి
- అభ్యర్థుల ప్రతిభ చూసి ఉద్యోగాలు ఇవ్వలేదు
- వైఎస్సార్సీపీ హయాంలో వ్యవస్థలపై నమ్మకం కోల్పోయేలా ప్రవర్తించారు
- గ్రూప్-1 అక్రమాలపై శాసనసభలో ధ్వజమెత్తిన చంద్రబాబు
- ఎవాల్యుయేషన్ చేసిన 66 మంది అనర్హులే

**అమరావతి**

వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన గ్రూప్-1 పరీక్షల్లో అడుగడునా అక్రమాలే జరిగాయని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. పేపర్లు దిద్దే బాధ్యతలు ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకున్నారని మండిపడ్డారు. తప్పుడు అఫిడవిట్లు సమర్పించి కోర్టునే బురిడీ కొట్టించే యత్నం చేశారని విమర్శించారు. గత హయాంలో జరిగిన గ్రూప్-1 అవకతవకలపై అసెంబ్లీ వేదికగా సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అభ్యర్థుల ప్రతిభ చూసి ఉద్యోగాలు ఇవ్వలేదు : "గ్రూప్-1పై నివేదికలు చూస్తే భయంకరమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏపీపీఎస్సీ నియమాలు, నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారు. పేపర్లు దిద్దే బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడమే తప్పు.

- మిగతా3లో



## సరుకు రవాణాకు భారీ ఊతం

- రూ.9,450 కోట్లతో 4 రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- 4 రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్
- బంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో 410 కి.మీ. మేర అదనపు రైల్వే లైన్లు

త్వరలో 100 పురపాలక సంఘాలకు

# ఎన్నికలు

- బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు
- బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న కూటమి ప్రభుత్వం
- రాష్ట్రంలోని 123 పురపాలక సంఘాలకు గానూ 100 చోట్ల జరగనున్న ఎన్నికలు
- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి




**అమరావతి**

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లను యథాతథంగా అమలు చేయాలని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎ. సురేశ్ కుమార్ ఉత్వర్వులు జారీ చేశారు. పురపాలక శాఖ కమిషనర్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రకారం, రాష్ట్రంలోని మొత్తం 123 పురపాలక సంఘాలకు గానూ 100 చోట్ల త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఐదేళ్ల పదవీకాలం ముగిసిన 87 పురపాలక సంఘాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది నవంబర్ నాటికి పదవీకాలం పూర్తి చేసుకోనున్న మరో 13 చోట్ల ఎన్నికలు జరగనున్నాయి. న్యాయపరమైన సమస్యల కారణంగా 23 పురపాలక సంఘాల్లో ఎన్నికలు సాధ్యపడవని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుని, వెనుకబడిన తరగతులకు మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు

- మిగతా3లో



2027 ఎన్నికలే

## లక్ష్యం

- బ్రాహ్మణులను ఆకట్టుకునే పనిలో మాయావతి!
- 2027 యూపీ ఎన్నికలే లక్ష్యంగా బీఎస్పీ వ్యూహరచన
- గతంలో అధికారం తెచ్చిపెట్టిన దళిత-బ్రాహ్మణ ఫార్ములాపై ఫోకస్
- కీలక నేత సతీశ్ చంద్ర మిశ్రాకు పెరిగిన బాధ్యతలు
- ఇటీవలి ఎన్నికల్లో ఘోర పరాభవం నుంచి కోలుకునే ప్రయత్నం

వెలిగొండ నిర్వాసితుల

## త్యాగాలను ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదు



- వెలిగొండ నిర్వాసితులకు పరిహారం చెక్ అందజేసిన సీఎం చంద్రబాబు
- రూ.200కోట్ల మేర నిర్వాసితులకు పరిహారం చెల్లించిన సీఎం
- చంద్రబాబు అన్ని సౌకర్యాలు కల్పించారన్న నిర్వాసితులు

**అమరావతి**

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభానికి కౌంట్‌డౌన్ మొదలైన వేళ నిర్వాసితులకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. ఇవాళ మరో రూ.200 కోట్ల పరిహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా నిర్వాసిత కుటుంబాలకు అందజేశారు. ఇప్పటికే ఓటీఎస్ కింద 2557 కుటుంబాలకు

- మిగతా3లో



## పీఎం కేర్స్ నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేయాలి

- పీఎం కేర్స్ నిధులపై అభిజీత్ దీప్కే కీలక వ్యాఖ్యలు
- ఆ నిధులతో వెయ్యికి పైగా హైటెక్ మోడల్ స్కూళ్లు నిర్మించొచ్చన్న సీజేపీ వ్యవస్థాపకుడు
- కనీస సదుపాయాల కోసం దేశంలోని పిల్లలు ఎదురుచూస్తున్నారు

# జెన్ జీపై మోదీ సర్కార్ ఫోకస్



దేశంలోని యువతీయువకులను (జెన్ జీ)ని ఆకట్టుకునేందుకు, వారికి మరింత దగ్గరయ్యేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమాన్ని చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా దేశంలోని యూనివర్సిటీలకు ప్రతి రోజూ ఒక కేంద్ర మంత్రిని పంపించాలని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం యోచిస్తోంది. 'వన్ డే, వన్ యూనివర్సిటీ' పేరుతో చేపట్టనున్న ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులతో మంత్రులు నేరుగా మాట్లాడి, వారి అభిప్రాయాలు, సమస్యలు, దేశానికి సంబంధించిన వివిధ అంశాలపై వారి ఆలోచనలను తెలుసుకోనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా కేవలం ప్రభుత్వ పథకాల్ని ప్రచారం చేయడం మాత్రమే కాకుండా, యువత ఏమనుకుంటున్నారు?, వారి ప్రధాన సమస్యలు ఏంటి? దేశంలో జరుగుతున్న పరిణామాలపై వారి అభిప్రాయాలు ఎలా ఉన్నాయి? వంటి అంశాల్ని తెలుసుకోవడంపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టనుంది. విద్యార్థులకు ముఖ్యంగా యువత కోసం అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అవకాశాల్ని కూడా కేంద్ర మంత్రులు వివరించనున్నారు. విద్యార్థుల కోపాన్ని తగ్గించి, వారితో నేరుగా మాట్లాడేందుకే ఈ కొత్త ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంపై చర్చ జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇటీవల దేశవ్యాప్తంగా నీట్ సహా ఇతర ప్రధాన ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం కలకలం రేపింది. తర్వాత దిల్లీలోని జంతర్ మంతర్ సహా అనేక ప్రాంతాల్లో విద్యార్థులు చేపట్టిన భారీ నిరసనలు, ఆందోళనల నేపథ్యంలో కేంద్రం తాజా నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా జులై 20న ఆందోళన బాట పట్టిన విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్ తీవ్ర విమర్శలకు దారితీసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కూడా ప్రతిపక్షాలు ఈ అంశంపై నిరసనలు తెలిపాయి. ఈ వివాదాల నడుమ జులై 25న ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే యువతలో నెలకొన్న అసంతృప్తిని తొలగించి, వారిలో నమ్మకాన్ని కలిగించేందుకు కేంద్రం నేరుగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.

ఇంకా ఈ వన్ డే వన్ యూనివర్సిటీ ఇనిషియేటివ్‌ను సమర్థవంతంగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఇద్దరు మంత్రులకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ- విశ్వవిద్యాలయాలు, ఇతర కేంద్ర మంత్రుల్ని సమన్వయం చేయనున్నారు. కేటాయించిన రోజున ఒక కేంద్ర మంత్రి వర్సిటీకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడతారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (ఖ+జ) లెక్కల ప్రకారం దేశంలో 57 కేంద్ర విశ్వవిద్యాలయాలు, 522 రాష్ట్ర విశ్వవిద్యాలయాలు సహా మొత్తం 1300 కంటే ఎక్కువ యూనివర్సిటీలు ఉన్నాయి.

**యువతరంవైపే ప్రధాని దృష్టి**

ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల యువతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. నిరసనల సమయంలో విద్యార్థులు, యువతను ఉద్దేశించి సోషల్ మీడియా ద్వారా పలుమార్లు సందేశాలు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనూ యువత కోసం పలు కొత్త కార్యక్రమాల్ని ప్రకటించారు. ఉచిత ఆన్‌లైన్ కోచింగ్, ఏఐ స్కిల్లింగ్ ప్రోగ్రామ్, క్రీడల్లో యువత ప్రతిభను గుర్తించే కార్యక్రమం వంటి అంశాల్ని ప్రస్తావించారు.

**కేంద్ర మంత్రుల సోషల్ మీడియా పనితీరుపైనా సమీక్ష**

ఇదే సమయంలో యువత, జెన్‌జీకి మరింత చేరువయ్యేందుకు సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించుకోవాలని కేంద్ర మంత్రులకు ప్రభుత్వం సూచించింది. ప్రధాని అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో కేంద్ర మంత్రుల సోషల్ మీడియా పనితీరు, వారి పోస్టులకు వస్తున్న రీచ్‌పై చర్చ జరిగినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ రీచ్ ర్యాంకింగ్స్‌లో మోదీ అగ్రస్థానంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మంత్రుల సోషల్ మీడియా పోస్టులు ఎంత మందికి చేరుతున్నాయి, వాటి ద్వారా ఏ మేర ప్రజల్ని చేరుకోగలుగుతున్నారనే అంశాలపై సమావేశంలో సమీక్ష జరిగినట్లు సమాచారం. యువతకు ప్రభుత్వ సందేశాలు మరింత విస్తృతంగా చేరేలా మంత్రులు తమ సోషల్ మీడియా రీచ్ పెంచుకోవాలని కూడా సూచించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# మోదీ ప్రభుత్వం యువత భవిష్యత్తును దెబ్బతీస్తోంది



విద్యార్థులు, యువత భవిష్యత్తును గత 12 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం తీవ్ర విమర్శలు చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేలా కాంగ్రెస్ సమగ్ర 'ఎడ్యుకేషన్ టు ఎంప్లాయ్‌మెంట్ రోడ్‌మ్యాప్' రూపొందించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. దిల్లీలని ఇందిరా భవన్?లో బుధవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం ప్రారంభ ప్రసంగం సందర్భంగా ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశంలో కొత్త పాఠశాలలు ప్రారంభం కావాల్సి ఉంది. అవి కాకపోగా, ఇటీవల సంవత్సరాల్లో సుమారు 94వేల పాఠశాలలు మూతపడ్డాయి. యువత భవిష్యత్తును మెరుగుపరిచే విధానాల స్థానంలో విద్యా రంగంలో ప్రైవేటీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రైవేటీకరణ పెరగడంతో ఉన్నత విద్య ఖరీదైనదిగా మారుతోంది. సాధారణ కుటుంబాలకు ఉన్నత విద్య అందుబాటులో లేకుండా పోతోంది. విద్యా సంస్థల్లో ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తుల ప్రాబల్యం పెరుగుతోంది. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో సంస్థల స్వరూపాన్ని మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని ఖర్గే అన్నారు.

**'పేపర్ లీకులు నియామకాల జాప్యం'**

చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ప్రయత్నించే యువతకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయని ఖర్గే పేర్కొన్నారు. పేపర్ లీకులు, నియామక పరీక్షల్లో అక్రమాలు, ఉద్యోగ నియామకాల్లో జాప్యం కారణంగా నిరుద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా పేద, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులే ఈ పరిణామాలతో ఎక్కువగా నష్టపోతున్నారని వ్యాఖ్యానించారు. యువతలో దేశవ్యాప్తంగా కనిపిస్తున్న ఆగ్రహం ఒక్కరోజులో పుట్టింది కాదని అన్నారు. వారి సమస్యలను వినడానికి ప్రభుత్వం ఎప్పుడూ తగినంత సమయం కేటాయించలేదని, సమస్యలను పరిష్కరించడానికి బదులుగా తాత్కాలిక చర్యలతో వాటిని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. దీంతో యువత రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. యువత సమస్యలను కాంగ్రెస్ తన రాజకీయ అజెండాలో చేర్చిందని ఖర్గే తెలిపారు. రాహుల్ గాంధీ ఛత్రోన్ కీ గూంజ్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల సమస్యలను జాతీయ స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లోనూ విద్య, పరీక్షలకు సంబంధించిన సమస్యలపై సమగ్ర చర్చ జరగాలని కాంగ్రెస్ కోరిందన్నారు.

**రామాలయ విరాళాల అంశంపైనా ప్రశ్నలు**

ఈ సందర్భంగా అయోధ్య రామాలయానికి సంబంధించిన విరాళాలపై వచ్చిన ఆరోపణలను కూడా ఖర్గే ప్రస్తావించారు. విరాళాల నిధుల దుర్వినియోగం లేదా చోరీ జరిగిందన్న ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రధాని ప్రజలకు సమాధానం చెప్పాలని, క్షమాపణ చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఆర్థిక అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**చైనా చొరబాట్లపైనా ప్రశ్నలు**

భారత్-చైనా సరిహద్దుల్లో చైనా చొరబాట్లకు సంబంధించిన వార్తలపైనా ఖర్గే స్పందించారు. జాతీయ భద్రతను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించకూడదని అన్నారు. అదే సమయంలో సరిహద్దుల పరిస్థితిపై ప్రజలు ప్రశ్నలు అడగకుండా జాతీయ భద్రత పేరుతో అడ్డుకోవడం కూడా సరికాదని వ్యాఖ్యానించారు. భారత సాయుధ దళాలపై తమకు అత్యంత గౌరవం ఉందని, అయితే సరిహద్దుల్లో వాస్తవ పరిస్థితి, కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ప్రజలకు పారదర్శకంగా సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.

**రాజీవ్ గాంధీని గుర్తుచేసుకున్న ఖర్గే**

స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తవుతున్నప్పటికీ కీలక రంగాల్లో పరిస్థితులు మెరుగుపడటానికి బదులుగా దిగజారు తున్నాయని ఖర్గే వ్యాఖ్యానించారు. మతపరమైన ఉద్రిక్తతలు, రేవడి సంస్కృతి రాజకీయాల మధ్య విద్య, ఉపాధి అంశాలు తీవ్రంగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆరోపించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకున్న ఖర్గే, భారీ మెజారిటీతో ప్రభుత్వం నడిపినప్పటికీ రాజీవ్ గాంధీ యువతను తన విధానాల కేంద్రంగా ఉంచారని అన్నారు. స్వాతంత్ర్యం తర్వాత అందుబాటు ధరల్లో విద్యను విస్తరించేందుకు కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలే పేదలు, అణగారిన వర్గాలకు సామాజిక, ఆర్థిక పురోగతికి మార్గం చూపాయని పేర్కొన్నారు.

**కీలక నేతల హాజరు**

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి ఖర్గే అధ్యక్షత వహించారు. మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ సహా పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. సీనియర్ నాయకులు అంబికా సోని, ముకుల్ వాస్నిక్, పీ చిదంబరం తదితర అగ్రనేతలు కూడా పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు.

# ఏకంగా 600 మంది ఉద్యోగుల తొలగింపు



**న్యూఢిల్లీ :** ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ సంస్థలో తీసుకున్న చర్యలను మంత్రిత్వశాఖకు వివరించారు. పరీక్షల బృందాన్ని పూర్తిగా పునర్వ్యవస్థీకరించే చర్యల్లో భాగంగా సుమారు 600 మంది నిపుణులను తొలగించి, వారి స్థానంలో కొత్త నిపుణులను నియమించనున్నారు. ప్రశ్నపత్రాల్లో పొరపాట్లు, లోపాలు లేకుండా చూసేందుకు నాలుగు అంచెల తనిఖీ వ్యవస్థను తీసుకురానున్నారు. ఎన్టీఏలో వచ్చే రెండు నుంచి మూడు వారాల్లో మరో 20-25 మంది అధికారులను నియమించనున్నట్లు విద్యాశాఖ తెలిపింది. భవిష్యత్‌లో మరిన్ని నియామకాలు చేపట్టే ప్రణాళికపైనా సమీక్ష నిర్వహించినట్లు పేర్కొంది. అంతేకాకుండా ఎన్టీఏ కార్యాలయాలను కొత్త భవనాలకు యుద్ధప్రాతిపదికన తరలించనున్నారు. కార్యాలయాల భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బందిని మోహరించనున్నారు. ప్రశ్నపత్రం లీకేజీ వివాదం, ఇటీవల యూజీసీ నెట్ పరీక్షల్లో తలెత్తిన సమస్యలపై కేంద్ర విద్యాశాఖ తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు, పరీక్షల నిర్వహణలో పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తడంతో ఎన్టీఏలో సంస్కరణలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రల్హాద్ జోషి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో పరీక్షల నిర్వహణకు అవసరమైన భద్రతా, మౌలిక సదుపాయాలను పటిష్టం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల నెట్ జూన్ 2026 పరీక్షలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టుల్లో పరీక్షలను మళ్లీ నిర్వహించాలని ఎన్టీఏ ప్రకటించింది. ఈ మూడు ప్రశ్నపత్రాల్లో వాస్తవపరమైన తప్పులు, టైపింగ్ పొరపాట్లు, అనువాద లోపాలు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు నిపుణుల కమిటీ గుర్తించింది. దీంతో అవి న్యాయమైన, లోపరహిత పరీక్ష ప్రమాణాలకు అనుగుణంగా లేవని కమిటీ తేల్చింది. పరీక్షల నిర్వహణలో లోపాలపై చర్యల్లో భాగంగా జూలైలోనే 47 మంది ఎన్టీఏ అధికారుల సేవలను ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా మరో 600 మంది నిపుణులను తొలగించి కొత్త వారిని నియమించే ప్రక్రియ చేపట్టడంతో భారీ స్థాయిలో ప్రక్షాళన జరుగుతోంది. పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక చర్య చేపట్టింది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అన్యాయ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు-2026ను పార్లమెంట్ ఇటీవల ముగిసిన వర్షాకాల సమావేశాల్లో ఆమోదించింది. పేపర్ లీకేజీ కేసుల్లో కఠిన శిక్షలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, నిర్ణీత గడువులో విచారణ వంటి నిబంధనలను ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. పేపర్ లీకేజీ, నిరసన చేస్తున్న విద్యార్థులపై జూలై 20న జరిగిన పోలీసు చర్యల నేపథ్యంలో పార్లమెంట్ ఉభయ సభల్లో తీవ్ర గందరగోళం నెలకొన్న తర్వాత ఈ బిల్లుకు ఆమోదం లభించింది. మొత్తంగా ఎన్టీఏలో చేపడుతున్న తాజా సంస్కరణలు పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రత, ప్రశ్నపత్రాల నాణ్యతను పెంచడమే లక్ష్యంగా సాగుతున్నాయి.

## సరుకు రవాణాకు భారీ ఊతం

దేశంలో రవాణా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ, రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన నాలుగు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. వీటి మొత్తం అంచనా వ్యయం సుమారు రూ.9,450 కోట్లు. అదే సమయంలో బిహార్‌లోని ముజఫర్‌పూర్-సీతామఢి-సోన్బర్సా మార్గాన్ని నాలుగు లేన్ల జాతీయ రహదారిగా అభివృద్ధి చేసేందుకు మరో రూ.3,590.73 కోట్ల ప్రాజెక్టుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కొత్తగా ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టులతో భారత రైల్వే నెట్‌వర్క్‌లో సుమారు 410 కిలోమీటర్ల మేర అదనపు లైన్లు అందుబాటులోకి రానున్నాయి. 2030-31 నాటికి ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బంగాల్? ఖరగ్‌పూర్ నుంచి ఒడిశాలోని భద్రక్ (రాణీతాల్) వరకు 173 కి.మీ. మేర నాలుగో లైన్ నిర్మించనున్నారు. భద్రక్-హరిదాస్‌పూర్ మధ్య 75 కి.మీ. మేర మరో నాలుగో లైన్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని గుమ్మిడిపూండి నుంచి తమిళనాడులోని గూడూరు వరకు 90 కి.మీ. మేర మూడో, నాలుగో లైన్లను నిర్మించనున్నారు. ఒడిశాలోని కటక్ నుంచి పరదీప్ (బడబంధ) వరకు 72 కి.మీ. మేర మూడో, నాలుగో లైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ నాలుగు ప్రాజెక్టులు బంగాల్, ఒడిశా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాలను కవర్ చేయనున్నాయి. సుమారు 6,448 గ్రామాలకు రైలు కనెక్టివిటీ మెరుగుపడనుంది. దాదాపు 60 లక్షల మంది ప్రజలు ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రయోజనం పొందుతారని కేంద్రం తెలిపింది.

**సరుకు రవాణాకు భారీ ఊతం**

ఈ మార్గాలు బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంట్, ఇనుము-ఉక్కు, కంటైనర్లు, ఆటోమొబైల్స్, ఆహార ధాన్యాల వంటి సరుకుల రవాణాకు కీలకమైనవి. లైన్ల విస్తరణతో ఏటా 76 మిలియన్ టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని కేంద్రం అంచనా వేసింది. పర్యాటక రంగానికీ ఈ ప్రాజెక్టులు ఉపయోగపడనున్నాయి. కుల్డిహా వన్యప్రాణి అభయారణ్యం, భితర్‌కణిక జాతీయ ఉద్యానవనం, చంద్రభాగ, తలసరి-ఉదయ్‌పూర్, చాందీపూర్ బీచ్, పులికాట్ సరస్సు, నెలపట్టు పక్షుల అభయారణ్యం, లలిత్‌గిరి తదితర పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు కనెక్టివిటీ మెరుగుపడనుంది. రైల్వే పర్యావరణహిత, ఇంధన సామర్థ్యం కలిగిన రవాణా మార్గమని కేంద్రం తెలిపింది. ఈ ప్రాజెక్టుల వల్ల ఏటా సుమారు 13 కోట్ల లీటర్ల చమురు దిగుమతి తగ్గడంతో పాటు 65 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని అంచనా వేసింది. ఇది సుమారు 2.60 కోట్ల చెట్లను నాటినంత ప్రయోజనంతో సమానమని పేర్కొంది.

**బిహార్‌లో ఎన్‌హెచ్-22 విస్తరణ**

ఇక బిహార్‌లో ముజఫర్‌పూర్-సీతామఢి-సోన్బర్సా మధ్య 82.578 కి.మీ. పొడవైన ఎన్‌హెచ్-22ను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్?ఏఎం)లో చేపట్టే ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.3,590.73 కోట్లు. ఈ రహదారి భారత్-నేపాల్ సరిహద్దులోని సోన్బర్సాను ముజఫర్‌పూర్‌లోని ఎన్‌హెచ్-27తో అనుసంధానించనుంది. దీంతో ముజఫర్‌పూర్, బరౌనీ వంటి ఆర్థిక కేంద్రాలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు గంగానది పరివాహక ప్రాంతంలోని సరుకు రవాణా కేంద్రాలకు అనుసంధానం బలోపేతం కానుంది. నేపాల్ సరిహద్దులోని భిఠామోర్ ల్యాండ్ పోర్టు ద్వారా ప్రయాణికులు, సరుకుల రాకపోకలకు కూడా ఈ రహదారి కీలకం కానుంది.

**ఏడు వంతెనలు- మూడు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు**

ప్రాజెక్టులో ఏడు ప్రధాన వంతెనలు, మూడు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు, రెండు ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. వీటిలో బాగ్మతీ నదిపై 340 మీటర్ల పొడవైన ప్రధాన వంతెన కూడా ఉంది. ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు 1,170 మీటర్లు, 270 మీటర్ల పొడవైన రెండు ఫ్లైఓవర్లు నిర్మించనున్నారు. ముజఫర్‌పూర్, ముక్సుద్‌పూర్, రున్నీ సైద్‌పూర్, తుమ్మా, డుమ్రా, భూతాహీ, సోన్బర్సా వంటి జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించి.. సురక్షితమైన, వేగవంతమైన రాకపోకలకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని కేంద్రం తెలిపింది.

## పీఎం కేర్స్ నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేయాలి

పీఎం కేర్స్ నిధులపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల మౌలిక వసతులు మెరుగుపర్చేందుకు పీఎం కేర్స్ ఫండ్‌లోని నిధులను వినియోగించాలని డిమాండ్ చేశారు. తాను నిజంగానే కేర్ తీసుకుంటున్నానని ప్రధాని నరేంద్ర మోదీ నిరూపించుకోవాలని అన్నారు. పాఠశాలలకు వెళ్లేందుకు సరైన రోడ్లు, తరగతి గదుల్లో బెంచీలు, తాగునీరు వంటి కనీస సదుపాయాల కోసం దేశంలోని పిల్లలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పీఎం కేర్స్ ఫండ్‌లో వేల కోట్ల రూపాయలు ఉన్నప్పుడు వాటిని పాఠశాలల అభివృద్ధికి ఎందుకు ఉపయోగించకూడదని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. 'తాజా ఆడిట్ నివేదిక ప్రకారం, 2025 మార్చి 31 నాటికి పీఎం కేర్స్ ఫండ్? మొత్తం నిల్వ రూ.8,452 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.7,173 కోట్లుగా ఉంది. పాఠశాలలకు వెళ్లేందుకు సరైన రోడ్లు, తరగతి గదుల్లో బెంచీలు, తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త పాఠశాలల కోసం ఈ నిధులను ఎందుకు ఉపయోగించడం లేదు? ఒక మంచి మౌలిక వసతులతో కూడిన మోడల్ స్కూల్ నిర్మాణానికి సుమారు రూ.8 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తే, రూ.8,500 కోట్లతో వెయ్యికి పైగా హైటెక్ పాఠశాలలను నిర్మించే అవకాశం ఉంది. కానీ అలా జరగడం లేదు. ఇటువంటి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు' అని దీప్కే ప్రశ్నించారు.

**గ్రామీణ పాఠశాలల్లో దుస్థితి**

మహారాష్ట్రలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల తాను సందర్శించిన పాఠశాలల్లో పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయని దీప్కే ఆరోపించారు. కనీస సౌకర్యాలు ఎందుకు లేవని అధికారులను ప్రశ్నించగా, నిధుల కొరత ఉందని సమాధానం ఇచ్చారని తెలిపారు. ఒకవైపు పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించేందుకు నిధులు లేవని అధికారులు చెబుతుండగా, మరోవైపు పీఎం కేర్స్ ఫండ్‌లో వేల కోట్ల రూపాయలు ఉన్నాయని ఆయన అన్నారు. ఆ నిధులను పిల్లల విద్య కోసం ఉపయోగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మరో పోస్ట్?లో గ్రామీణ పాఠశాలల దుస్థితిని చూపించేలా మురికిగా ఉన్న మరుగుదొడ్డి, శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం ఫొటోలను కూడా దీప్కే సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. పీఎం కేర్స్ నిధులను మంచి పనికి ఉపయోగించవచ్చు అంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీఎం కేర్స్ నిధులను ప్రజల కోసం, ముఖ్యంగా పేద పిల్లల విద్య, పాఠశాలల అభివృద్ధి కోసం ఉపయోగించాలని దీప్కే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. పిల్లలు మంచి పాఠశాలలు, మెరుగైన సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని, అందుబాటులో ఉన్న నిధులను వారి భవిష్యత్తు కోసం వినియోగించాలని అన్నారు. ప్రధాని నిజంగా పిల్లల గురించి పట్టించుకుంటున్నారని చూపించాలని వ్యాఖ్యానించారు. తాజా ఆడిట్ నివేదిక ప్రకారం, పీఎం కేర్స్ ఫండ్‌లోని మొత్తం రూ.8,452 కోట్లలో సుమారు రూ.7,846 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉన్నాయని, మరో రూ.605 కోట్లు సేవింగ్స్ బ్యాంక్ ఖాతాల్లో ఉన్నాయని వెల్లడైంది.

## 2027 ఎన్నికలే లక్ష్యం..

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన వ్యూహాలకు పదును పెట్టారు. 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, గతంలో 2007లో తనకు చారిత్రక విజయాన్ని అందించిన "దళిత-బ్రాహ్మణ" సామాజిక సమీకరణాన్ని ఆమె తిరిగి తెరపైకి తెస్తున్నారు. వరుస ఓటములతో కుదేలైన పార్టీని గట్టెక్కించేందుకు ఈ పాత ఫార్ములానే సరైన మార్గమని ఆమె విశ్వసిస్తున్నారు.

ఈ వ్యూహంలో భాగంగా, పార్టీలో కీలక నేత, తన అత్యంత సన్నిహితుడైన సతీశ్ చంద్ర మిశ్రాకు మాయావతి అదనపు బాధ్యతలు అప్పగించారు. బీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన, ఇకపై పార్టీకి సంబంధించిన లీగల్, మీడియా విభాగాలకు కూడా నేతృత్వం వహించనున్నారు. అలాగే, కేంద్రం ఎన్నికల సంఘానికి సంబంధించిన వ్యవహారాలను సైతం ఆయనే పర్యవేక్షిస్తారని మాయావతి ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో మిశ్రా పాత్ర అత్యంత కీలకం కానుందని ఆమె స్పష్టం చేశారు.

# వైఎస్సార్సీపీ హయాంలో గ్రూప్-1 నిర్వహణ అతిపెద్ద స్కామ్

-మొదటిపేజీ తరువాయి

ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఆమోదం లేకుండా ఏ పనీ చేయకూడదు. పేపర్లు దిద్దడంలో ప్రతి దశలోనూ నిబంధనలు ఉల్లంఘించారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు చేయాల్సిన పనిని కార్మికులతో చేయించారు. ఈ మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌లో వివరాలు షేర్ చేసుకున్నారు. ఇష్టానుసారంగా పేపర్లు దిద్దే అధికారం వీరికి ఎవరిచ్చారు మార్కులు తగ్గించడం, పెంచడం ఇష్టం వచ్చినట్లు చేశారు. సీఎం ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌కు సెక్రటరీ పోస్టు ఇచ్చారు. ఏపీపీఎస్సీ ఛైర్మన్‌ను కట్టడి చేశారు. అభ్యర్థుల ప్రతిభ చూసి ఉద్యోగాలు ఇవ్వలేదు. వ్యవస్థలపై నమ్మకం కోల్పోయేలా ప్రవర్తించారు” అని సీఎం చంద్రబాబు అసెంబ్లీ వేదికగా ధ్వజమెత్తారు. “తొలుత హైదరాబాద్‌లో, రెండోసారి హాయ్‌లాండ్‌లో పేపర్లు దిద్దించారు. హైదరాబాద్‌లో ఎవాల్యుయేషన్ చేసిన వారిలో 25 మంది అనర్హులు. హాయ్‌లాండ్‌లో ఎవాల్యుయేషన్ చేసిన 66 మందీ అనర్హులే. మాన్యువల్ ఎవాల్యుయేషన్ జరగాలి, డిజిటల్ మూల్యాంకనం వద్దని హైకోర్టు చెప్పింది. భవన నిర్మాణ కార్మికులు, డ్రైవర్లు, ప్లంబర్లతో పేపర్లు దిద్దించారు. ఫ్రీలాన్సర్ మహంకాళి రఘురామ్‌ను నియమించారు. 166 మందిలో 50 మంది డిగ్రీ లెక్చరర్లను వినియోగించారు. గ్రూప్-1 జవాబు పత్రాల్లో ఫ్లూయిడ్‌తో తప్పులు దిద్దకూడదు. కానీ 55 చోట్ల తప్పులు సరిచేశారు. 49వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులు ప్రింట్ చేశారు. గ్రూప్-1 పరీక్షలు రాసిన లెక్చరర్‌ను కూడా పేపర్లు దిద్దేందుకు పిలిచారు. కోర్టులను పక్కదారి పట్టించేందుకు అధికారులతో తప్పుడు అఫిడవిట్లు వేయించారు. ఖర్చుల కోసం రూ.1.14 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలతో సిట్ ఏర్పాటైంది.

వైఎస్సార్సీపీ హయాంలో గ్రూప్-1 నిర్వహణ అతిపెద్ద స్కామ్. ఇలాంటి తప్పులు చేయాలంటే భయపడేలా శిక్షలు ఉండాలి. ఎవరైనా ప్రతిభకు పట్టం కట్టాలి, పైరవీలకు దూరంగా ఉండాలి. ఇలాంటి తప్పులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలి. చేసింది సరైనదే అని చెప్పే దమ్ము, ధైర్యం వైఎస్సార్సీపీ నేతలకు ఉందా? ఇలాంటి అక్రమాలకు పాల్పడితే ప్రతిభావంతులు నష్టపోతారు. తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత మనందరిదీ” అని సీఎం చంద్రబాబు అన్నారు. “వైఎస్సార్సీపీ హయాంలో గ్రూప్-1 నిర్వహణ



అతిపెద్ద స్కామ్. ఇలాంటి తప్పులు చేయాలంటే భయపడేలా శిక్షలు ఉండాలి. తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత మనందరిదీ. ఇలాంటి పనులు చేస్తే ప్రతిభావంతులైన పిల్లలు నష్టపోతారు. వ్యవస్థలు సరిగా పనిచేస్తే ఎవరూ తప్పు చేయలేరు. ఎవరైనా ప్రతిభకు పట్టం కట్టాలి, పైరవీలకు దూరంగా ఉండాలి. ఇంతకంటే నేరాలు, ఘోరాలు వేరే ఉంటాయా. ఇలాంటి తప్పులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలి. మీరు చేసింది సరైందే అని చెప్పే దమ్ము, ధైర్యం ఉందా?

### మామూలుగా అరెస్ట్ చేస్తే సరిపోదు

వ్యక్తుల కంటే వ్యవస్థలు ముఖ్యమన్న చంద్రబాబు ఈ కుంభకోణంలో భాగస్వాములైన వారిని మామూలుగా అరెస్ట్ చేస్తే సరిపోదనీ అభిప్రాయపడ్డారు. ‘భవిష్యత్తులో తప్పులు చేయాలంటే భయపడేలా శిక్షలు విధిస్తాం. నాటి ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్?గా వ్యవహరించిన వ్యక్తే ఇంతటి దారుణాలకు పాల్పడ్డారు. వ్యవస్థలను భ్రష్టు పట్టించారు. ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేస్తాం. తిరిగి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. యువత ప్రతిభను గుర్తించి, వారి భవిష్యత్తుకు అండగా ఉంటాం’ అని చంద్రబాబు అన్నారు.

### రాష్ట్రానికి చెందిన విద్యార్థులే ఎక్కువ

టెక్నాలజీలో జాతీయ స్థాయిలోనే ఏపీ పిల్లలు ముందంజలో ఉంటారనీ, ఛీజుజూ పరీక్షల కోసం మన రాష్ట్రానికి చెందిన విద్యార్థులే ఎక్కువ మంది ఉన్నారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఎన్నికల్లో ఓటేయడంతో ఆగకుండా ప్రజా చైతన్యంతో వ్యవహరిస్తున్నారనీ, అధికారం ఇస్తే దోచుకుంటాం, పెత్తనం చేస్తామని అధికారం లేకుంటే రోడ్ల మీద పడి అరాచకం చేస్తామనడం ప్రజాస్వామ్యం కాదన్నారు. అడ్డగోలుగా వ్యవహరించే ఇలాంటి వ్యక్తులను ప్రజా చైతన్యంతో రాజకీయాలకు దూరంగా పెట్టగలం అన్నారు. 2024 ఎన్నికల్లో ఆ ప్రజా చైతన్యాన్నే ఓటర్లు చూపించారు. రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని నేను, పవన్ కల్యాణ్ చెబితే ప్రజలు నమ్మి ఓట్లేశారు, అద్భుతమైన తీర్పు ఇచ్చారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో డబ్బులు ఖర్చు పెట్టే సంస్కృతి పోవాలన్నారు. అప్పుడే ఇలాంటి దరిద్రాలన్నీ పోతాయన్నారు. అప్పుడే ఇలాంటి వారు రాజకీయాల్లోకి దూరంగా ఉంటారనీ చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

### స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర ఆవేదన లి

గ్రూప్-1 పరీక్షల్లో జరిగిన అవకతవకలపై శాసనసభలో చర్చ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సమాధానం ఇవ్వడానికి ముందు ఆయన మాట్లాడుతూ, తాను స్పీకర్ స్థానంలో ఉండి కాకుండా ఈ సభలోని ఒక శాసనసభ్యుడిగా తన మనసులోని మాటను చెబుతున్నానని పేర్కొన్నారు. గతంలో గ్రూప్-1 అక్రమాలపై వార్తాపత్రికలు, టీవీల్లో కథనాలు చూసినప్పటికీ వాటి తీవ్రతను ఇంతగా ఊహించలేదని, అయితే ఇప్పుడు సభలో ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చూశాక అభ్యర్థులకు ఎంతటి ఘోరమైన అన్యాయం జరిగిందో కళ్లకు కట్టినట్లయిందని స్పష్టం చేశారు. ఇంతటి తీవ్రమైన వ్యవహారంలో ప్రభుత్వం ఏమాత్రం మెతక వైఖరి ప్రదర్శించకూడదని స్పీకర్ తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాధారణంగా ఎవరినీ నొప్పించని స్వభావం కలవారే అయినప్పటికీ, నిరుద్యోగుల జీవితాలతో ముడిపడిన ఈ వ్యవహారంలో మాత్రం నిందితులపై ఉక్కుపాదం మోపాల్సిందేనని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు పాల్పడాలంటేనే ఎవరైనా భయపడేలా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇకపై ఇలాంటి తప్పుడు పనులు ఎక్కడా పునరావృతం కాకుండా చూడాలని, అందుకు ఇక్కడి నుంచే పటిష్టమైన చర్యలకు శ్రీకారం చుట్టాలని ముఖ్యమంత్రిని, సభను కోరారు.

# త్వరలో 100 పురపాలక సంఘాలకు ఎన్నికలు

-మొదటిపేజీ తరువాయి

చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఓటర్ల జాబితా తయారీ, వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు వంటి చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

### త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం

రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం మొదలుకానుంది. ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. అందులో భాగంగా నేడు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించింది. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్లతో ముందస్తు సమీక్ష చేశామని, ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఒక్కో ప్రక్రియ పూర్తి చేసుకుంటూ వెళ్తున్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో పలు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే సంబంధిత శాఖల కమిషనర్లకు సమాచారం ఇచ్చామని ప్రోటోకాల్ ప్రకారం ఏయే కార్యక్రమాలు చేయాలి అన్న దానిపై సమీక్షించినట్లు పునేఠా తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష జరిపినట్లు పునేఠా వివరించారు. ఓటర్ల జాబితా ప్రదర్శన ఆగస్టు 17తో పూర్తైందని చెప్పారు.

### పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు గ్రీన్‌సిగ్నల్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే 87 పుర, నగరపాలికలతో పాటు 13,341 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు స్పష్టం చేశాయి. ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు రెండు శాఖలు వేర్వేరుగా నివేదికలు సమర్పించాయి. డివిజన్లు, వార్డుల పునర్విభజనపై కోర్టులో ఉన్న కేసులు పరిష్కారమైతే 87 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియను వెంటనే ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పష్టం చేసింది. కోర్టు తీర్పు




ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిన 20 రోజుల్లోనే వంద చోట్లా పునర్విభజన ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించింది.

### మార్చితోనే పాలకవర్గాల పదవీకాలం పూర్తి

2021లో ఎన్నికలు జరిగిన 100 పుర, నగరపాలక సంస్థల్లో 87 చోట్ల ఈ ఏడాది మార్చితోనే పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. మరో 13 చోట్ల నవంబరు 22తో ముగియనుంది. సమీప గ్రామ పంచాయతీలను విలీనం చేసే చట్టం-5పై దాఖలైన పిటిషన్లతో గతంలో 23 చోట్ల ఎన్నికలు నిలిచిపోయాయి. అయితే వీటిలో మంగళగిరి-తాడేపల్లి, శ్రీకాళహస్తి, కావలి, అల్లూరుకి సంబంధించిన కేసులు ఇటీవల ఉపసంహరించుకున్నట్లు సమాచారం. మిగిలిన కేసుల పరిష్కారంపైనా వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు పురపాలక శాఖ ఎస్ఈసీకి నివేదించింది.

### పంచాయతీరాజ్ శాఖ గ్రీన్ సిగ్నల్

రాష్ట్రవ్యాప్తంగా 13,341 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు పంచాయతీరాజ్ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కోర్టు కేసులు, ఇతర కారణాలతో దాదాపు వంద పంచాయతీల్లో మినహా, మిగిలిన చోట్ల ఎన్నికలు నిర్వహించవచ్చని ఎస్ఈసీకి స్పష్టం చేసింది. దీనికోసం ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాలు ప్రచురించి, ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు నివేదికలో వివరించింది. 2021 ఎన్నికల సమయంలో విలీనం వివాదాలతో హైకోర్టులో కేసులు దాఖలు కావడంతో అప్పట్లో 354 పంచాయతీల్లో ఎన్నికలు ఆగిపోయాయి. వాటిలో కొన్ని కేసులు ఇప్పటికే పరిష్కారం కాగా, మరికొన్ని ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు పంచాయతీరాజ్ శాఖ తెలిపింది. ఏదిఏమైనా న్యాయపరమైన చిక్కులు తొలిగితే రాష్ట్రంలో అతి త్వరలోనే స్థానిక సమరం ఖాయంగా కనిపిస్తోంది.

### వెంటనే షెడ్యూల్ విడుదల

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. ప్రభుత్వ శాఖల సన్నద్ధతపై నివేదికలు అందడంతో, కోర్టు కేసుల అడ్డంకులు తొలగిన వెంటనే షెడ్యూల్ విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది.

# బలపడుతున్న అనుమానాలు... పవన్ గైర్హాజరుపై సోషల్ మీడియా

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవలి కాలంలో కొన్ని కీలక ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకాకపోవడం, టీడీపీ-జనసేన సోషల్ మీడియా గ్రూపుల మధ్య నడుస్తున్న సైలెంట్ వార్ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవలి కాలంలో కొన్ని కీలక ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకాకపోవడం, టీడీపీ-జనసేన సోషల్ మీడియా గ్రూపుల మధ్య నడుస్తున్న సైలెంట్ వార్ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. పవన్ కల్యాణ్ కేబినెట్ సమావేశం, సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభోత్సవం , రాజ్‌భవన్‌లో గవర్నర్ ఏర్పాటు చేసిన ఎట్ హోమ్ కార్యక్రమానికి దూరంగా ఉండటాన్ని వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున హైలైట్ చేసే ప్రయత్నం చేసింది. కూటమిలో విభేదాలు మొదలయ్యాయని ప్రచారం ప్రారంభించింది అగ్రనాయకులు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ పరస్పర గౌరవంతోనే ముందుకు సాగుతున్నప్పటికీ.. సోషల్ మీడియా వేదికగా కిందిస్థాయి కార్యకర్తలు, సానుభూతి పరుల మధ్య వివాదాలు ముదురుతుండటం ప్రతికూల అంశంగా మారింది. స్థానిక నియోజకవర్గాల్లో ప్రాధాన్యత, పనుల కేటాయింపులు, పోస్టింగ్స్ విషయంలో టీడీపీ-జనసేన శ్రేణుల మధ్య అసంతృప్తులు కనిపిస్తున్నాయి. ఒకరినొకరు టార్గెట్ చేసుకుంటూ పోస్టులు పెట్టుకోవడం ప్రత్యర్థులకు మంచి ఆయుధంగా మారుతోంది. అయితే ఈ సోషల్ మీడియా రచ్చను అరికట్టేందుకు ఇప్పటికే ఇరు పార్టీల అధినాయకత్వాలు హెచ్చరికలు జారీ చేస్తూ పరిస్థితిని కంట్రోల్ చేసే ప్రయత్నం చేస్తున్నాయి.వైసీపీ శ్రేణులు కూటమి దెబ్బతిందని ఎంత ప్రచారం చేస్తున్నప్పటికీ, సాధారణ ప్రజల్లో గానీ, ఓటర్లలో గానీ ఈ కథనాలపై విశ్వసనీయత కనిపించడం లేదు. 2024 ఎన్నికల్లో వచ్చిన భారీ విజయం కూటమి పునాది ఎంత బలంగా ఉందో స్పష్టం చేసింది. ప్రభుత్వపరంగా కీలక నిర్ణయాలు, సంక్షేమ పథకాల అమలు, అమరావతి పునర్నిర్మాణం వంటి ప్రతిష్టాత్మక అంశాల్లో చంద్రబాబు-పవన్ కల్యాణ్ ఇద్దరూ ఒకే మాటపై నడుస్తున్నారు. కాబట్టి కొన్ని చిన్న చిన్న గైర్హాజరులు , సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా కూటమి బంధం బలహీనపడిందని వారు ఆనందపడే ప్రయత్నం చేస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కూటమికి అసలైన సవాలుగా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల విజయాన్ని క్షేత్రస్థాయిలో నిలబెట్టుకోవాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల మధ్య సంపూర్ణ సమన్వయం అవసరం. గ్రామ స్థాయిలో స్థానాల సర్దుబాటు, నామినేషన్ల ఖరారు విషయంలో ఇరు పార్టీల మధ్య ఎలాంటి ఘర్షణ వాతావరణం రాకుండా చూసుకోవడమే అధినేతలకున్న పెద్ద టాస్క్. కింది స్థాయి క్యాడర్‌ను ఒకే వేదికపైకి తెచ్చి పోటీకి దించగలిగితే కూటమి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించవచ్చు. పవన్ కల్యాణ్ గైర్హాజరుపై వస్తున్న ఊహాగానాలకు తెరపడాలంటే ఇరు పార్టీలు మరింత వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సి ఉంది.

## వెలిగొండ నిర్వాసితుల త్యాగాలను ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదు

-మొదటిపేజీ తరువాయి

రూ.318 కోట్లు చెల్లించగా, తాజాగా మరో 1600 కుటుంబాలకు రూ.200 కోట్ల చెక్కులు అందాయి. దీంతో 4157 నిర్వాసిత కుటుంబాలకు ఇప్పటివరకు రూ.518 కోట్ల పరిహారం అందించినట్లైంది. త్యాగం చేసిన నిర్వాసితులకు అండగా నిలవడమే తమ సర్కార్ ధ్యేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వెలిగొండ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు పరిహారం అందిస్తూ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామని చెప్పారు. ఇప్పటివరకు రూ.518 కోట్లు పరిహారం చెల్లించామని, మిగిలిన మొత్తాన్ని కూడా త్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. మంచి చేసే ప్రభుత్వాలను ప్రజలు గుర్తించాలని, నిర్వాసితుల త్యాగాలను ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వెలిగొండ నిర్వాసితులు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. 30 ఏళ్ల కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. మరోవైపు సొంత ఇళ్లు నిర్మించుకున్న కుటుంబాలకు పరిహారం అందించడంతోపాటు పునరావాస కాలనీల్లో మౌలిక వసతులపై సర్కార్ దృష్టి సారించింది. మొత్తం ఏడు ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో వసతుల కల్పన చేపట్టగా పనులు దాదాపు పూర్తయ్యాయి. దీంతో నిర్వాసిత కుటుంబాలు పునరావాస కాలనీలకు తరలివెళ్తున్నాయి. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన వెలిగొండ నిర్వాసితులతో కలిసి నేతలు మాట్లాడారు. వెలిగొండ నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం వెనక్కి తగ్గదని నేతలు స్పష్టం చేశారు. మిగిలిన రూ.400 కోట్ల పరిహారాన్ని కూడా త్వరలో చెల్లిస్తామని చెప్పారు. ఈ నెలలోనే నల్లమల సాగర్‌కు నీరందిస్తామని తెలిపారు. పూర్తికాని వెలిగొండ ప్రాజెక్టు పూర్తైనట్లు జగన్ జాతికి అంకితం చేయడం ప్రపంచంలో ఎనిమిదవ వింతని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. ‘కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులను ఓ క్రమపద్ధతిలో పూర్తి చేసింది. నిర్వాసితులకు రూ.900 కోట్ల పరిహారం చెల్లింపులో వైఎస్ జగన్? పైసా కూడా చెల్లించలేదు. వెలిగొండ పనులు పూర్తి చేయడం ఎంత ముఖ్యమో నిర్వాసితులు కూడా అంతే ముఖ్యం. నిర్వాసితులకు సంబంధించిన ఏడు కాలనీల్లో నాలుగు కాలనీల్లో 100 శాతం మౌలిక వసతులు పూర్తయ్యాయి. మిగిలిన మూడు కాలనీల్లో పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని’ నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

వెలిగొండ విషయంలో గత ప్రభుత్వం నిర్వాసితులను, రైతులను తీవ్రంగా మోసం చేసిందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆరోపించారు. పూర్తికాని ప్రాజెక్టును పూర్తైనట్లు ప్రకటించి జాతికి అంకితం చేసిన ఘనత వైఎస్సార్సీపీకే దక్కుతుందని విమర్శించారు. ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబే తిరిగి దీన్ని ప్రారంభిస్తున్నారని చెప్పారు. నిర్వాసితులు గ్రామాలను ఖాళీ చేసి పునరావాస ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరారు. మరోవైపు చెప్పినట్లుగానే మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు. వెలిగొండ నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించిన తర్వాతే నీటిని విడుదల చేస్తామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. గత ఐదేళ్లలో రైతులకు జరిగిన అన్యాయాన్ని ప్రజలు గుర్తించారని చెప్పారు. ఈ ప్రాజెక్టును క్రమపద్ధతిలో పూర్తి చేయడంతోపాటు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికీ సమాన ప్రాధాన్యం ఇచ్చామని వెల్లడించారు. తమకు జిల్లాతో పాటు వెలిగొండ పూర్తి చేసిన సీఎం పేరు మీద చంద్రన్న మార్కాపురం జిల్లాగా పేరు పెట్టాలని 117 మంది శాసనసభ్యులు సంతకాలు చేశారని కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు.

### ప్రభుత్వం చేసిన సాయం మర్చిపోలేం

ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు అన్ని సౌకర్యాలు కల్పించారని నిర్వాసితులు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేసిన సాయం మర్చిపోలేమన్నారు. తాము చూడలేం అనుకున్న ప్రాజెక్టు పూర్తయినందుకు ఆనందంగా ఉందని భావోద్వేగానికి గురయ్యారు. మొత్తంగా వెలిగొండ నిర్వాసితుల త్యాగాలకు పరిహారంతో ప్రభుత్వం భరోసా కల్పించింది. మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ఈ ప్రాజెక్టు పూర్తికి అడుగులు వేగవంతమయ్యాయి. ఇక నల్లమలసాగర్ జలాలతో ప్రకాశం ప్రాంత రైతుల కలలు సాకారం కావడమే లక్ష్యంగా సర్కార్? ముందుకు సాగుతోంది.

## క్షేత్రస్థాయి కేడర్ పై జగన్ గురి

**విజయవాడ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయంగా మరోసారి ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాన్ని వేగవంతం చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత కొంతకాలం పార్టీ కార్యాలయానికే పరిమితమైన ఆయన ఇటీవల వరుస పర్యటనలు చేపడుతున్నారు. ఈ పర్యటనలు కేవలం పార్టీ నేతలను పరామర్శించేందుకే కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల పరిస్థితిని అర్థం చేసుకునేందుకు కూడా ఉపయోగపడుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.జగన్‌కు దాదాపు రెండు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉంది. ఈ కాలంలో ఎదురైన విజయాలు, పరాజయాల నుంచి ఆయన ఎన్నో విషయాలు నేర్చుకున్నారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజల స్పందనను అంచనా వేయడంలో జగన్‌కు మంచి అవగాహన ఉందనే అభిప్రాయం ఆయన అనుచరుల్లో ఉంది. గత ఎన్నికల్లో పార్టీకి ఎదురైన ఫలితాలకు కేవలం ప్రభుత్వ వ్యతిరేకత మాత్రమే కారణం కాదని, సంస్థాగతంగా జరిగిన లోపాలు కూడా కీలక పాత్ర పోషించాయని వైసీపీ నాయకత్వం గుర్తించినట్లు తెలుస్తోంది.ఎన్నికల అనంతరం పార్టీ శ్రేణుల్లో కొంత నిరుత్సాహం కనిపించింది. పలువురు నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా క్రియాశీలత తగ్గించుకోవడంతో క్షేత్రస్థాయిలో వైసీపీ బలహీనపడిందనే భావన ఏర్పడింది. ఈ నేపథ్యంలో జగన్ స్వయంగా ప్రజల్లోకి రావడం పార్టీ క్యాడర్‌కు కొత్త ధైర్యాన్ని ఇచ్చిందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.ఇటీవల గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర, కర్నూలు ప్రాంతాల్లో జగన్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఆయనను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం పార్టీ నాయకుల్లో ఆసక్తిని పెంచింది. ఈ స్పందనను వైసీపీ నాయకత్వం రాజకీయంగా అనుకూల సంకేతంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల్లో పార్టీకి పూర్తిగా ఆదరణ తగ్గిపోలేదని, సరైన కార్యక్రమాలతో తిరిగి బలపడే అవకాశం ఉందనే నమ్మకం కార్యకర్తల్లో ఏర్పడుతోందని సమాచారంఅయితే కేవలం జనసమీకరణతోనే రాజకీయ విజయాన్ని సాధించడం సాధ్యం కాదనే విషయం కూడా వైసీపీకి తెలుసని పరిశీలకులు అంటున్నారు. గతంలో జరిగిన సంస్థాగత లోపాలను సరిదిద్దడం, నియోజకవర్గ స్థాయిలో నాయకుల మధ్య సమన్వయం పెంచడం, కార్యకర్తలను మళ్లీ చురుగ్గా పనిచేసేలా చేయడం కీలకంగా మారనుంది. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడంతో పాటు పార్టీకి స్పష్టమైన కార్యాచరణ అవసరం.ఇదే సమయంలో జగన్ పర్యటనలు కూటమి పార్టీల్లో కూడా రాజకీయ చర్చకు కారణమవుతున్నాయని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న దశలో ప్రతిపక్ష నేతగా జగన్ ప్రజల్లో చురుగ్గా తిరగడం రాబోయే రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపవచ్చనే అంచనాలు ఉన్నాయి.మొత్తంగా చూస్తే జగన్ పర్యటనలు వైసీపీకి రాజకీయంగా మళ్లీ చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. ఇకపై కూడా ఇదే దూకుడును కొనసాగిస్తూ జిల్లాల వారీగా పర్యటనలు నిర్వహించాలని పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల మధ్య నిరంతరం ఉంటూ పార్టీని పునర్నిర్మించడమే లక్ష్యంగా జగన్ ముందుకు సాగితే, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరిన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది

### మండలిలో..


ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలి రోజే ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్‌సీపీ అనుసరించిన వ్యూహాత్మక వైఖరి రాజకీయంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. ప్రజా సమస్యలపై పోరాడేందుకు దక్కిన అత్యున్నత రాజ్యాంగ వేదికైన శాసనసభను బహిష్కరించి, కేవలం శాసనమండలిలో డీఎస్సీపై వాయిదా తీర్మానం ఇవ్వడం ద్వారా ఆ పార్టీ తన బలహీనతను తానే బయటపెట్టుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసెంబ్లీలో ప్రజాప్రతినిధులుగా గొంతు విప్పాల్సిన 11 మంది ఎమ్మెల్యేలు సభకు రాకుండా ముఖం చాటేయడం పార్టీ ప్రజాస్వామిక విశ్వసనీయతను ప్రజల్లో తీవ్రంగా దెబ్బతీస్తోంది.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పూర్తి గణాంకాలతో ప్రతిపక్ష వైఖరిని ఎండగడుతూ.. అసెంబ్లీకి వచ్చి డీఎస్సీ సహా ఏ అంశంపైనైనా చర్చించాలని పదేపదే విసిరిన సవాల్‌కు వైఎస్సార్‌సీపీ నుంచి అత్యంత పేలవమైన స్పందన వచ్చింది. సభలో ఉన్న ప్రజాప్రతినిధులెవరూ ఆ సవాల్‌ను స్వీకరించే సాహసం చేయకపోగా, సభకు వచ్చే అర్హతే లేని మాజీ మంత్రి పేర్ని నాని బయట మీడియా ముందుకొచ్చి తాను చర్చకు వస్తానని ప్రకటించడం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేసింది. ఎన్నికైన 11 మంది ఎమ్మెల్యేలలో ఏ ఒక్కరూ లోకేష్ సవాల్‌ను ఎదుర్కొనేందుకు ముందుకు రాకపోవడం పార్టీలోని నాయకత్వ లోపాన్ని స్పష్టం చేస్తోంది.ప్రజా సమస్యలపై సభలో నిలదీయకుండా గురువారం నాటి ప్రెస్ మీట్‌కు వాయిదా వేసుకోవడం ద్వారా ప్రతిపక్షం తనకు తానే రాజకీయంగా మరింత ఆత్మరక్షణలో పడింది.

# విద్యుత్ బిల్లు చెల్లించేందుకు మాన్యువల్ కౌంటర్లను పునరుద్ధరించాలి



**గుంతకల్లు ఆగస్టు 19 (ప్రజా జ్యోతి):** విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లు చెల్లించేందుకు గతంలో మాదిరిగా మాన్యువల్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆలూరు రోడ్ కరెంట్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి డి.2 ఎ.ఇ చంద్రశేఖర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో విద్యుత్ వినియోగదారులకు అనుకూలంగా మార్కెట్ యార్డ్ డి వన్ కరెంట్ ఆఫీస్ వద్ద మరియు అంతోని స్ట్రీట్ పాత ఈఆర్వో ఆఫీస్ వద్ద ఆలూరు రోడ్డు కరెంట్ ఆఫీస్ వద్ద విద్యుత్ బిల్లు కట్టడానికి కేంద్రాలు ఉండేది గత నెల నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ కేంద్రాలను విద్యుత్ అధికారులు మూసి వేయడం జరిగింది. దీనివలన నిరక్షరాస్యులు, వృద్ధులు, పేదవారు, రైతులు చాలా ఇబ్బంది లకు గురవుతున్నారు. కేవలం డిజిటల్ ఆన్లైన్ ఫోన్ పే, గూగుల్ పే పద్ధతులలో విద్యుత్ బిల్లులు కట్టుకోవాలని అధికారులు చెబుతున్నారు దీనివలన నిరక్షరాస్యులు, పేదలు, రైతులు, విద్యుత్ బిల్లులు ఎలా కట్టాలో తెలియక ఆందోళ నలో ఉన్నారు. ప్రతినెల చివరిలోపు విద్యుత్ బిల్లు కట్టకపోతే ఆ ప్రాంతాల లైన్మెన్లు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నారు అదనంగా వంద రూపాయలు రుసుం పేరుతో వసూలు చేస్తున్నారు ఇతర దేశాల ఈ గూగుల్ పే, ఫోన్ పే కంపెనీల లాభాల కోసం కేంద్ర ప్రభుత్వం ఈమధ్య కాలంలోనే యూ.పీ.ఐ లాంటి ఉచిత సేవలు పైన కూడా చార్జీలు వసూలు చేస్తున్నారు అమెరికా లాంటి అగ్ర రాజ్యాల దేశాల మెప్పు కొరకు నరేంద్ర మోడీ పేద, మధ్యతరగతి, రైతు, వ్యవసాయ కార్మికులను ఇబ్బందుల కు గురి చేస్తున్నారు కావున ఇప్ప టికైనా రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉన్న విద్యుత్ బిల్లు కట్టించుకునే కౌంటర్ల ను తిరిగి ప్రారంభించాలని లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తం గా ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కసాపురం రమేష్, పట్టణ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, షాష, సూరి, జ్యోతి, రాము ఉల్లిగప్ప, సుగుణ, రాణి, ఆదిలక్ష్మి, మస్తాన్, కిష్టప్ప, భాష తదితరులు పాల్గొన్నారు.

## చౌప్పెల్ల గ్రామ దేవత శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో రేపు శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రత కార్యక్రమం.



**ఆలమూరు ఆగష్టు 19(ప్రజాజ్యోతి):** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామ దేవత శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో రేపు శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్బంగా అతి భారీ ఎత్తున వ్రతం కార్యక్రమం నిర్వహించడానికి ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు చేస్తున్నారు.వరలక్ష్మి వ్రతం కార్యక్రమం ఆలయ అర్చకులు యలమంచిలి పళ్ళం రాజు(రాజశేఖర్), బుచ్చిరాజు సోదరులు ఆధ్వర్యంలో ఈ పూజ కార్యక్రమం జరుగుతుంది.శ్రావణ శుక్రవారం జరిగె వరలక్ష్మి వ్రతం కార్యక్రమంలో పాల్గొనె వారికి టికెట్ వెల 200 రూపాయలు. ఈ వ్రతం పూజ కార్యక్రమం చేయించుకున్న భక్త మహాతల్లులకు వెండి రూపు, డజను గాజులు, పసుపు, కుంకుమలు వేసుకునె భరిణి, అమ్మవారి ప్రసాదం ఇస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

## బాధిత కుటుంబాలకు ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ అండ



**బాపట్ల ఆగస్టు 19 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన రెండు కుటుంబాలకు ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆపన్నహస్తం అందించింది. బాపట్ల మండలం కంకటపాలెం గ్రామ శివారులో కాలువ కట్టపై నివాసముంటున్న శ్రీను, పిచ్చయ్యల ఇళ్లు అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో కట్టుబట్టలతో మిగిలిన బాధిత కుటుంబాలకు సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు బండ్రెడ్డి గోపి మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత్వానికి నిదర్శనమన్నారు. ప్రమాదంలో ఇళ్లతో పాటు నిత్యావసర వస్తువులు కోల్పోయిన బాధితులకు తమ వంతు సహాయం అందించామని తెలిపారు. మరింత మంది దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి బత్తుల సురేష్, కోశాధికారి జోగి సువర్ణ రాజు, భీమా కోటేశ్వరరావు, కొత్త మల్లికార్జున రావు, బండ్రెడ్డి అంకమ్మరావు, పెద్దమల్లు శ్రీకాంత్, నరాల శెట్టి నాగరాజు, పులిపాటి రాజు, కోడిరెక్క రవి, బొగ్గవరపు శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రామచంద్రపురం జిల్లా కోర్టు పిపి కప్పల సునీల్ కుమార్ జన్మదిన వేడుకలు.



**ఆలమూరు ఆగష్టు 19(ప్రజాజ్యోతి):** రామచంద్రపురం 13వ అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవార్డు గ్రహీత కప్పల సునీల్ కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం మండల కేంద్రమైన ఆలమూరులోని ఆయన నివాసం వద్ద ఘనంగా జరిగాయి. తన జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కిడ్నీ బాధితులకు 25 కేజీల బియ్యంతో పాటు నగదు అందజేసి తన సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. అనంతరం నాన్ భవిత పాఠశాలలో వికలాంగ విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి వారితో కలిసి ఆత్మీయంగా గడిపారు. జన్మదిన వేడుకలను ఆడంబరాలకు దూరంగా సేవా కార్యక్రమాలతో నిర్వహించడంపై పలువురు అభినందించారు.సునీల్ కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, న్యాయవాదులు, పత్రికా సోదరులు ఆయన నివాసానికి తరలివచ్చారు. ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో ఇంటికి చేరుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి సునీల్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# 18వ వార్డు ఇంచార్జ్ మున్నెల్లి సుధాకర్ ఆధ్వర్యంలో ఘనంగా ఇంటింటి ప్రచారం

### ముఖ్య అతిథిగా హాజరైన మంచూరు సూర్యనారాయణ రెడ్డి!



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 19 (ప్రజా జ్యోతి)** స్థానిక పట్టణంలోని 18వ వార్డు పరిధిలో గల త్యాగరాజు కాలనీ, సుందరయ్య కాలనీలలో "రెండేళ్ల నమ్మకం సంక్షేమం, అభివృది ధ" కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. 18వ వార్డు ఇంచార్జ్ మున్నెల్లి సుధాకర్, మాజీ జడ్పిటిసి ఎద్దుల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వార్డు ప్రజలు, మహిళలు మంచూరు సూర్యనారాయణ రెడ్డికి మేళతాళాలు, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన కాలనీల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సంక్షేమానికి, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని మంచూరు సూర్య నారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు యంత్రాంగం సిద్ధం



**బాపట్ల ఆగస్టు 19 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికారులు ముందస్తు ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునీత్ సూచించారు. బుధవారం సచివాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు.ఓటర్ల జాబితా ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయడంతో పాటు పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సిబ్బంది, బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ తెలిపారు. సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాలను గుర్తించి అందుకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ మాట్లాడుతూ బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. చీరాల, వేటపాలెం ప్రాంతాలకు సంబంధించిన కోర్టు వ్యవహారాలు పూర్తయ్యాయని బాపట్లకు సంబంధించిన తీర్పు రావాల్సి ఉందని వివరించారు. ఎన్నికల నిర్వహణపై ఎంపీడీవోలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో లవన్న, జిల్లా పంచాయతీ అధికారి కే. ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్లు హాసిని, డానియల్ జోసెఫ్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్పీ కాలువ పనులు వేగవంతం

**రూ.2.50 కోట్లతో ఆధునికీకరణ..**

**బొల్లాపల్లి మేజర్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే ఏలూరి**



**మార్టూరు ఆగస్టు 19 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా ఎన్ఎస్పీ కాలువల అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతున్న నేపథ్యంలో బొల్లాపల్లి మేజర్‌పై జరుగుతున్న ఆధునికీకరణ పనులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పరిశీలించారు. 2.50 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో కొనసాగుతున్న పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న పూడిక, గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు డ్రాఫ్ట్‌ల మరమ్మతులు, కాలువ కట్టల పటిష్టతకు సంబంధించిన పనులు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, కాలువలో నీటి ప్రవాహానికి ఎక్కడా ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.కాలువ కట్టల బలహీన ప్రాంతాలను గుర్తించి ముందుగానే మరమ్మతులు చేపట్టాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. పనులను జాప్యం లేకుండా పూర్తి చేసి రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఎన్ఎస్పీ కాలువల ఆధునికీకరణ పూర్తయితే నీటి ప్రవాహ సామర్థ్యం మెరుగుపడి ఆయకట్టు పరిధిలోని చివరి భూములకు కూడా సాగునీరు అందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా సాగునీటి వనరులను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## పోడూరులో వైభవంగా జరిగిన జైన్ దేవాలయం శంఖుస్థాపన.



**పోడూరు ప్రజా జ్యోతి రిపోర్టర్ కొట్టి రామం ఆగస్టు 19.** ఆచంటలోని శ్రీ పద్మనాభ ప్రభు స్వామి జైన్ దేవాలయం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో పోడూరులో బస్టాండ్ సెంటర్ సమీపంలో నిర్మించనున్న జైన్ దేవాలయంకు ఆచంట జైన్ దేవాలయం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు బుధవారం వైభవంగా మంగళవాయిధ్యాలు, పవిత్ర వేద మంత్రోచ్చరణాల మధ్య సంప్రదాయబద్ధముగా పూజాకార్యక్రమాలు నిర్వర్తించి శంఖుస్థాపన చేశారు. పోడూరు లో నిర్మించబడుతున్న జైన్ దేవాలయం ఆచంట జైన్ దేవాలయం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో పిఠాపురం శీతలనాద్ జైన్ సంఘం వారి ఆర్థిక సహాయంతో నిర్మించబడుతుందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు ఈ శంకుస్థాపన కార్యక్రమంనకు నరసాపురం పాలకొల్లు ఆచంట ప్రాంతాల నుండి పోడూరు పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు మహిళా భక్తులు హాజరయ్యారు. ఆచంట జైన్ దేవాలయం ట్రస్ట్ సభ్యులతో పాటు స్థానిక ప్రముఖులు రుద్రరాజు రమేష్ రాజు చేకూరి సూరిబాబు రుద్రరాజు వరహాల రాజు పోడూరి కృష్ణమూర్తి శెట్టిబత్తుల సువర్ణ రాజు ఆర్ శివరామరాజు తదితరులు ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కోండ్రాజుపేట ఆదివాసులపై కేసు కొట్టివేత


### రంపచోడవరం జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తీర్పు



**కూనవరం ఆగస్టు 19. ప్రజా జ్యోతి కూనవరం:** మండలంలోని కోండ్రాజుపేట గ్రామానికి చెందిన ఆదివాసులపై కూనవరం రేంజ్ అటవీ అధికారులు 2021లో నమోదు చేసిన కేసును రంపచోడవరం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు కొట్టివేసింది. కేసుపై విచారణ, ఇరుపక్షాల వాదనలు అనంతరం కోర్టు ఈ మేరకు తీర్పు వెలువరించింది.కేసులో మాజీ పార్లమెంట్ సభ్యుడు సోడే రామయ్య, సీపీఐ డివిజన్ కార్యదర్శి గుజ్జా మోహనరావుతో పాటు మరో ఎనిమిది మంది ఉన్నారు. కేసు కొట్టివేయడంతో కోండ్రాజుపేట గ్రామ ఆదివాసులు హర్షం వ్యక్తం చేశారు.కేసులో నిందితుల తరపున న్యాయవాదులు ధర్మల లక్ష్మీనారాయణ, మడివి రవితేజ వాదనలు వినిపించారు. తీర్పు అనంతరం న్యాయవాదులకు సోడే రామయ్య, గుజ్జా మోహనరావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. సోడే రామయ్య, గుజ్జా మోహనరావు వంటి నాటి తరం ఉద్యమ నేతల తరఫున కోర్టులో వాదించడం తమకు గర్వకారణమని న్యాయవాదులు పేర్కొన్నారు.

## ఇచ్చినమాటనిలబెట్టుకో!..

**జీవో నెంబర్ 3 ను,పునరుద్ధరించి చట్టం చేయుటకు అసెంబ్లీలో తీర్మానం చేయాలి!..**




**వి.ఆర్.పురం,ఆగస్టు19(ప్రజాజ్యోతి ప్రతినిధి)** జీవో నెంబర్3 ను పునర్ధారించి,అసెంబ్లీలో చట్టం చేయాలని ,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇచ్చిన మాట నిబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ 1/70పరిరక్షించాలని, బుధవారం ఒక్కరోజుదీక్ష,రేఖపల్లి సెంటర్లో, ఆదివాసీ గిరిజన సంఘంఆధ్వర్యంలోదీక్షచేశారు.

## అసెంబ్లీ భద్రతపై ఎస్పీ క్షేత్రస్థాయి పరిశీలన




**గుంటూరు ఆగస్టు 19 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల నేపథ్యంలో భద్రతా చర్యలను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ బుధవారం మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమావేశాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేలా పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, వాహన తనిఖీ కేంద్రాలు, ప్రవేశ మార్గాలు, వీఐపీ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. భద్రతా తనిఖీల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని, అనుమానాస్పద కదలికలు గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు.అసెంబ్లీ పరిసరాల్లో విధులు నిర్వహించే సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాలు, డ్రోన్ నిఘా, మెటల్ డిటెక్టర్లు తదితర సాంకేతిక పరికరాలను సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. ఇంటెలిజెన్స్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వీఐపీ, వీవీఐపీ రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజలు, స్థానికులు, ఉద్యోగులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమతి లేని కార్యక్రమాలు, నిరసనలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ముందుగానే గుర్తించి చట్టపరంగా వ్యవహరించాలన్నారు.ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, సిబ్బందితో సమన్వయంతో వ్యవహరిస్తూనే భద్రత విషయంలో రాజీ పడవద్దని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేస్తూ అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ పరిశీలనలో అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్, ఎస్బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, తుళ్లూరు సీఐ కే. శ్రీనివాసరావు, ఆర్ఐలు కృష్ణయ్య, శ్రీహరి రెడ్డి తదితర అధికారులు, బందోబస్తు సిబ్బంది పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనలో మహిళల పాత్ర కీలకం: ఈగల్ సీఐ జి. వెంకటేశ్వరరావు




**కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం (ప్రజా జ్యోతి)** గంజాయి, మత్తు పదార్థాల వంటి మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తులు, కుటుంబాలు మరియు సమాజం తీవ్రంగా దెబ్బతింటాయని ఈగల్ సీఐ జి. వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో 'ఈగల్ పల్లెబాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని డ్వాక్రా మహిళలకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రత్యేక అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.ఈ సదస్సులో సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తల్లిదండ్రులు నిరంతరం తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ, వారికి సరైన మార్గదర్శనం చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో డ్వాక్రా మహిళలు తమ వంతు బాధ్యతగా కుటుంబ సభ్యులను, చుట్టుపక్కల యువతను చైతన్యపరచాలని కోరారు.

**సమాచారం ఇస్తే వివరాలు గోప్యం**

గ్రామాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు మరియు వినియోగానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కు గానీ, లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ తెలియజేయాలని సీఐ పిలుపునిచ్చారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం ముగింపులో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు తమ వంతు సహకారం అందిస్తామని డ్వాక్రా మహిళల చేత అధికారులు ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఈగల్ సీఐ జి. వెంకటేశ్వరరావుతో పాటు ఏపీఎం విజయలక్ష్మి, సీసీ వెంకటరమణ, ఈగల్ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## భావాన్ని వ్యక్తీకరించడానికి భాషతో పనిలేకుండా ప్రపంచాన్ని ఏకం చేసే ఏకైక కళ ఫోటోగ్రఫీ ..డా అడ్డాల



**కాకినాడ జిల్లా (ప్రజా జ్యోతి)** స్థానిక సర్పవరం జంక్షన్ లో జస్వంత్ స్టూడియో లో ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు,ఈ సందర్భంగా లూయిస్ డాగ్యురే చిత్రానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాకినాడ ఫోటోగ్రఫర్స్ సంఘం అధ్యక్షుడు వీర్రాజు మాట్లాడుతూ "?1839లో ఫ్రెంచ్ ప్రభుత్వం "డాగ్యురోటైప్" అనే మొదటి ప్రాక్టికల్ ఫోటోగ్రఫీ ప్రక్రియను అధికారికంగా ప్రపంచానికి పరిచయం చేసిందని, దీనికి గుర్తుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 19న ఈ రోజును జరుపుకుంటారని,ఫోటోగ్రఫీ కళను, సైన్స్‌ను మరియు దాని వెనుక ఉన్న ఫోటోగ్రాఫర్ల ప్రతిభను గుర్తించడం ఈ రోజు యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా విచ్చేసిన ప్రముఖ దంత వైద్యులు డా అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ "ఫోటోగ్రఫీ అనేది గ్రీకు పదం నుండి వచ్చిందని , ఫోటో అంటే కాంతి, గ్రాఫి అంటే తీసుకోవడం అని ఒక చిత్రం వేయి పదాల కంటే శక్తివంతమైనదని ,భావోద్వేగాలు, చారిత్రక ఘట్టాలు మరియు అందమైన జ్ఞాపకాలను కాలంలో బంధించి తరతరాలకు అందించే అద్భుతమైన మాధ్యమం ఫోటోగ్రఫీ అని,భావాన్ని వ్యక్తీకరించడానికి భాషతో పనిలేకుండా ప్రపంచాన్ని ఏకం చేసే ఏకైక కళ ఫోటోగ్రఫీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాబూరావు జస్వంత్ శ్రీనివాస్, మనోహర్,రవి, మోహన్, రాము, గంగాధర్, శివాజి, బాబీ పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలి



**బాపట్ల ఆగస్టు 19 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ రూపొందించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత కోన రఘుపతి డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై అసెంబ్లీలో ప్రత్యేకంగా చర్చించి పంటల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాల పరిస్థితిపై ముందస్తు అంచనాలు ఉన్నందున సాగునీటి లభ్యత పంటల సాగు రైతులకు అందించాల్సిన సహాయంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళిక ప్రకటించాలని అన్నారు. నీటి వనరుల పరిస్థితిని సమీక్షించి, రైతులు నష్టపోయే పరిస్థితి రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.కృష్ణా డెల్టా పరిధిలో సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని కోన రఘుపతి కోరారు. పంటల సాగుపై రైతులకు ముందుగానే స్పష్టమైన సూచనలు ఇవ్వడంతో పాటు, వర్షాభావంతో నష్టపోయే రైతులు, వ్యవసాయ కూలీలకు తక్షణ సహాయం అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అన్నారు.రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా అత్యవసర ప్రణాళికతో ముందుకు రావాలని కోన రఘుపతి కోరారు. ముఖ్యంగా బాపట్ల జిల్లా, కృష్ణా డెల్టా రైతులకు సాగునీటి విషయంలో స్పష్టత కల్పించి, వ్యవసాయ రంగానికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గవిని కృష్ణ మూర్తి,కోకి రాఘవరెడ్డి, వడ్డిముక్కల డేవిడ్, కాగిత సుధీర్ బాబు, మరుప్రోలు ఏడుకొండల రెడ్డి,ఇనగలూరి మాల్యాద్రి,పిన్ని బోయిన ప్రసాద్, చెరుకూరి కిరణ్,ఆడే చందు,ఆడే నాని, ఆట్ల ప్రసాద్ రెడ్డి, నర్రావుల వెంకట్రావు, పుట్ల సుబ్బారావు,గునివిని బుల్లి రెడ్డి, పీట బాబు, ఇసాక్,గుడారు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు

# శాసన సభలో బొత్స పై అచ్చెన్న అనుచిత వాఖ్యలు చేయడం తగదు

- రాజకియ అనుభవం ఉన్న బొత్సను దద్దమ్మ అనడం బాధాకరం
- రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో ఆయన పాత్ర కీలకమైనది
- డీఎస్సీ అవినీతిని నిలదీస్తే సమాధానం చెప్పలేక డైవర్షన్ పాలిటిక్స్ చేయడం సిగ్గుచేటు
- వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి ( పార్లమెంట్) దుంపల రామారావు
- శాసన సభలో హుందాతనం , సంయమనం పాటించాలి
- బొత్స ను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి
- వ్యవసాయ రంగ మంత్రిగా అచ్చెన్న పూర్తిగా విఫలం
- విజయనగరం జిల్లా పార్లమెంట్ పరిశీలకులు కిల్లి వెంకట సత్యన్నారాయణ




**శ్రీకాకుళం, ప్రజాజ్యోతి న్యూస్:**మాజీ మంత్రి , ఎమ్మెల్సీ బొత్స సత్యన్నారాయణ పై అచ్చెన్నాయుడు అనుచిత వాఖ్యలు చేయడం తగదని వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి ( దుంపల రామారావు) ,విజయనగరం పార్లమెంట్ పరిశీలకులు కిల్లి వెంకట సత్యన్నారాయణ అన్నారు. అచ్చెన్న చేసిన వాఖ్యలను ఖండిస్తూ విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుంపల రామారావు మాట్లాడుతూ స్వయంకృషితో ఎదిగి నాలుగున్నర దశాబ్దాల రాజకీయ చరిత్రలో ఎమ్మెల్యేగా, ఎంపీగా, 15 ఏళ్ళు మంత్రిగా పని చేసిన బొత్సను దద్దమ్మ అని బాధాకరమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కీలక పదవులు అధిరోహించడమే కాకుండా రెండు రాష్ట్రాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఏకైక నాయకుడు సత్యనారాయణ అని గుర్తు చేశారు. డీఎస్సీ నియామకాల్లో జరుగుతున్న అక్రమాలు, అర్హత లేని అభ్యర్థులకు ఉద్యోగాల కల్పన, స్పోర్ట్స్ కోటాలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై సమగ్ర విచారణ వెంటనే జరిపించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అవినీతిపై నిలదీస్తుంటే సమాధానం చెప్పలేక డైవర్షన్ పాలిటిక్స్ చేయడం ఈ కూటమి ప్రభుత్వంకు ఎల్లో మీడియా కి కొత్తేమీకాదన్నారు. విద్య వైద్యం సేద్యం ఈ మూడు రంగాలపై చర్చించే దమ్ము మీకుందా అని సవాల్ విసిరారు. ఈ సందర్భంగా కిల్లి వెంకట సత్యన్నారాయణ మాట్లాడుతూ శాసన సభలో హుందాతనం సంయమనం పాటించాలని అధికార మదంతో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడని విమర్శించడం సభా మర్యాదలకు విరుద్ధమన్నారు. డీఎస్సీ అంశంలో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణకు ఆయన డిమాండ్ చేస్తే దానికి సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలు ,పరుష పదజాలంతో ఎదురుదాడి చేయడం సరైన పద్ధతి కాదని తెలిపారు. చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించి ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాల్సిన సభను వ్యక్తిగత దూషణలకు వేదికగా మార్చడం కూటమి దిగజారుడు రాజకీయానికి నిదర్శనం అన్నారు. బొత్స ను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకావాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మెంటాడ స్వరూప్ మాట్లాడుతూ బొత్స సత్యనారాయణ రాజకీయ అనుభవం, ప్రజా జీవితంలో ఆయనకున్న సుదీర్ఘ సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. విధానాలపై విమర్శలు చేసుకోవచ్చని, అయితే వ్యక్తిగతంగా కించపరిచేలా మాట్లాడటం ఎంతమాత్రం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో ప్రతిపక్ష నాయకులపై ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని స్వరూప్ అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారాలు చూపాల్సిన శాసనసభను వ్యక్తిగత విమర్శలకు వేదికగా మార్చడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని హితవు పలికారు.

# పునరావాస కాలనీ స్థల ఎంపిక !..

**తాడువాయి ఆప్షన్481..**

**తిరువూరు ఆప్షన్ 181..**

**121 మంది ఇంకా నోనిర్ణయం!..**





**వి.ఆర్.పురం,ఆగస్టు19(ప్రజాజ్యోతి ప్రతినిధి)**పోలవరం ప్రాజెక్టు ఫేజ్--1బి,పరిధిలో వి.ఆర్.పురం,గ్రామానికి చెందిన గిరిజనేతర ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పునరావాస కాలనీ స్థల ఎంపికపై స్థానిక వి.ఆర్.పురం,గ్రామంలోని సచివాలయం వద్ద బుధవారం అధికారులునిర్వాసితప్రజలతో గ్రామసభ నిర్వహించారు.ఈసందర్భంగా పునరావాసకాలనీ స్థలఎంపికకు సంబంధించి ఇంతకుముందు ఆప్షన్--1,లేదా ఆప్షన్--2,ను ఎంచుకోవాలని గిరిజనేతర పిడిఎఫ్స నుకోరి,ఆప్షన్ ఫారాలను అధికారులు స్వీకరించి ఉన్నారు. బుధవారం జరిగినఈ గ్రామసభలో, ఎస్.డి.సి బాలకృష్ణరెడ్డి, మాట్లాడుతూ తాడ్వాయి ఆప్షన్ కు 481,మంది కూరుకోగా, తిరువూరు ఆప్షన్ కు 181,మంది ఎన్నుకున్నారని, స్పష్టం చేశారు.ఇంకా120 మంది ఎటువైపు ఎన్నుకోకుండా తటస్థంగాఉన్నారని,వారి వద్ద నుంచి ఈరెండు రోజుల్లో,బుధ,గురు,వారాల్లో వారి ఆప్షన్ ఫారాలను అధికారులకు ఇవ్వాలనిఆయన కోరారు.ఇప్పటివరకువచ్చిన రెండు ఆప్షన్ లో తాడ్వాయి కోరుకున్న నిర్వాసితులను ముందుగా వారిని సర్దుబాటు చేయటం జరుగుతున్నదని సూచించారు.తిరువూరు కోరుకున్నవారికి, తర్వాత చూస్తామని తెలిపారు. ఈ మేరకు ఆయన తాడ్వాయి,ప్రాంత పునరావాస నివాసస్థలాలు ఉన్నప్రదేశాన్ని ప్లెక్సీమ్యాపులో చూపించి ఎక్కడెక్కడ ఎన్ని ప్లాట్స్ ఉన్నాయో వివరించిచెప్పారు.దీనికి నిర్వాసిత ప్రజలుమాకు ఆప్రదేశాన్ని నేరుగా చూపించాలని ఆతరువాత మేము ఎక్కడఉండాలో నిర్ణయిస్తామని వారుతెలపగా నిర్వాసితులకు ఆప్రదేశాలు తప్పనిసరిగా చూపిస్తామని, ఎస్.డి.సి,బాల కృష్ణారెడ్డి, వివరించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వై సరస్వతి,ఎటపాక సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ,ఎస్సై ఎస్.డి సాదిక్,విఆర్వో భవాని,నిర్వాసిత ప్రజలు తదితరులు హాజరయ్యారు.

## గొల్లప్రోలు మున్సిపాలిటీలో వార్డుల పునర్విభజన

**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** 2011 జనాభా లెక్కల ఆధారంగా గొల్లప్రోలు పురపాలక సంఘం పరిధిలో ప్రస్తుతం ఉన్న 20 వార్డులను 23 వార్డులుగా పునర్విభజించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్. నం.64, తేదీ 24.03.2026తో పాటు, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, ఆంధ్రప్రదేశ్ వారి ఆర్.సి. నం.13032/2/2026/ఎ1-2, తేదీ 01.04.2026 ఉత్తర్వుల ప్రకారం వార్డుల పునర్విభజనకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు.సదరు ప్రతిపాదనలను పరిశీలించిన కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారు ఆర్.సి. నం.13033/62/2026-హెచ్ 1, తేదీ 14.08.2026 ద్వారా వార్డుల పునర్విభజన ప్రతిపాదనలను ఆమోదించారు. తదనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ నం.419, తేదీ 19.08.2026 ద్వారా గొల్లప్రోలు పురపాలక సంఘానికి సంబంధించి 23 వార్డులకు సంబంధించిన సరిహద్దులతో కూడిన సవరణ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.ఈ నోటిఫికేషన్‌ను ప్రజల సమాచారార్థం పురపాలక సంఘం కార్యాలయ నోటీసు బోర్డుతో పాటు తహసీల్దార్ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, శాఖా గ్రంథాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో 19.08.2026 నుంచి అందుబాటులో ఉంచినట్లు గొల్లప్రోలు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.కావున వార్డుల పునర్విభజనకు సంబంధించిన వివరాలను ప్రజల పరిశీలనార్థం తెలియజేస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.



# ఈ క్రాప్ ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు

- ప్రతీ ఒక్క రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ లో నమోదు చేసుకోవాలి
- ఏ.డి. ఏ వద్దాది శ్రీనివాస రావు
- మండల ఆర్.ఎస్ . కె ఇంచార్జీలతో సమీక్ష సమావేశం



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** ఈ క్రాప్ నమోదుతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని ,ప్రతీ ఒక్క రైతు ఈ క్రాప్ లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏ.డి. ఏ వద్దాది శ్రీనివాస రావు అన్నారు. పొందూరు మండలంలోని రైతు సేవా కేంద్రం (ఆర్.ఎస్.కె) ఇంచార్జి లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ పంట పూర్తి స్థితి ప్రాముఖ్యత ఏపి. ఎఫ్.ఆర్ రిజిస్టేషన్లు ఫార్మర్ యాప్ డౌన్లోడ్ పి. ఎం.ఎఫ్.బి.వై నమోదు ,ఫెర్టిలైజర్ విక్రయాలు తదితర అంశాల పై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ శాఖ సేవలు సమర్థవంతంగా అందేలా ఆర్.ఎస్.కె ఇన్‌చార్జిలు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా వ-పంటలో పంటల నమోదు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని, ప్రతి రైతు తన పంట వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.ఎరువుల విక్రయాల పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. యూరియా బస్తా రూ.266.50, డి. ఏ .పి బస్తా రూ.1,350 ధరకు మాత్రమే రైతులకు విక్రయించాలని స్పష్టం చేశారు. రైతుల నుంచి ఎటువంటి అదనపు మొత్తాన్ని వసూలు చేయరాదని ఆదేశించారు. ఎరువుల విక్రయాల్లో నిబంధనలు ఉల్లంఘించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే పి.ఎం ఎఫ్.బి.వై నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ఫార్మర్ యాప్ డౌన్‌లోడ్స్,ఏపి.ఎఫ్.ఆర్ రిజిస్ట్రేషన్లను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని తెలిపారు. రైతులకు అవసరమైన సమాచారం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆర్.ఎస్. కె ఇన్‌చార్జిలకు సూచించారు.నిర్దేశించిన అన్ని కార్యక్రమాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి, రైతులకు వ్యవసాయ శాఖ సేవలు మరింత సమర్థవంతంగా అందేలా సమన్వయంతో పనిచేయాలని శ్రీనివాసరావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం శ్రీనివాస బాబు ఏ.ఈ.ఓ పి ప్రవీణ్ కుమార్ ఆర్.ఎస్. కె ఇంచార్జీలు పాల్గొన్నారు.

# గొల్లప్రోలులో అట్టహాసంగా 'ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం

48, 49 బూత్‌లలో విస్తృతంగా పర్యటించిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు
అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రచారంలో పాల్గొన్న నేత.. కార్యకర్తల్లో ఉత్సాహం
ప్రభుత్వ రెండేళ్ల పాలన, 'సూపర్-6' పథకాలపై ఇంటింటికీ ప్రచారం







**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం జోరుగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం 48, 49 పోలింగ్ బూత్‌ల పరిధిలోని పలు వార్డుల్లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పర్యటించారు.

**అనారోగ్యాన్ని లెక్కచేయని సుబ్బారావు**

గత కొన్ని రోజులుగా ఆరోగ్యం సహకరించకపోయినా పార్టీ కార్యక్రమంపై ఉన్న నిబద్ధతతో గుండ్ర సుబ్బారావు స్వయంగా ప్రచారంలో పాల్గొన్నారు. వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలుసుకున్నారు. అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా కార్యక్రమంలో పాల్గొనడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.'సూపర్-6' హామీల అమలు, మహిళలు, రైతులు, యువత, వృద్ధులకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా తెలుసుకుని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు**

కార్యక్రమం అనంతరం గుండ్ర సుబ్బారావు గొల్లప్రోలు శివాలయ మాన్యంలో కొలువైన శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులు, స్థానికులకు స్వహస్తాలతో ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, తెలుగు తమ్ముళ్లు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మకం

-పెరిక కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి బద్రి బీసీలకు అండగా నిలిచింది టీడీపీ ప్రభుత్వమే
--వైసీపీ హయాంలో బీసీలకు అన్యాయం కూటమి నిర్ణయంతో బీసీలకు న్యాయం
--చంద్రబాబు,పవన్ కళ్యాణ్,లోకేష్,సవితకు వనపర్తి బద్రి కృతజ్ఞతలు



**కాకినాడ జిల్లా ఆగస్టు 19(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రలో మర్చిపోలేని రోజుగా నిలిచిపోతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెరిక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి వీరభద్రరావు (బద్రి) పేర్కొన్నారు.గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం,పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.బీసీలకు రాజకీయంగా, సామాజికంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుందని బద్రి పేర్కొన్నారు.స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత దివంగత ఎన్టీఆర్‌కు దక్కుతుందని,73,74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తితో 1995లో యాక్ట్-5 ద్వారా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదేనని అన్నారు.1995,2001,2006, 2013 సంవత్సరాల్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసినట్లు గుర్తుచేశారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జీవో 176 ద్వారా బీసీల రిజర్వేషన్లను తగ్గించడం వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు.జీవోలు 559, 560 ద్వారా 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లు 24.15 శాతానికి తగ్గించడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16,800 మంది బీసీ నాయకులు రాజకీయ అవకాశాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక సంస్థల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తేనే గ్రామస్థాయి నుంచి నాయకత్వం ఎదిగి, రాజకీయంగా బీసీలు మరింత బలోపేతం అవుతారని బద్రి పేర్కొన్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలపై దాడులు,రాజకీయ హత్యలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు.పెరిక సామాజిక వర్గానికి చెందిన తోట చంద్రయ్య హత్య ఘటనను ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ,బీసీలకు అన్యాయం చేసిన రాజకీయ విధానాలను ప్రజలు గమనించారని అన్నారు.కూటమి ప్రభుత్వం తాజాగా గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తీసుకున్న నిర్ణయం బీసీల రాజకీయ భవిష్యత్తుకు భరోసా కల్పించిందని బద్రి పేర్కొన్నారు.ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్,బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కట్టుబడి పనిచేస్తున్నారని కొనియాడారు.బీసీలు అంటే తెలుగుదేశం.. బీసీలకు అండగా నిలిచే ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం అనే విషయం మరోసారి రుజువైందని బద్రి అన్నారు.బీసీల సంక్షేమం,రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్,బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు బీసీ వర్గాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యులు ధనేకుల సూర్య భాస్కరం వీరభద్రం,టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి మదినే దొరబాబు,లింగంపర్తి సొసైటీ డైరెక్టర్ దనేకుల అదృష్టదీపుడు,మాజీ ఎంపీటీసీ చిలకమర్తి వీరభద్రం,బీసీ నాయకులు దిడ్డి రమణ,అత్తి వీర్రాజు,వనపర్తి జోగేంద్ర తదితరులు పాల్గొన్నారు

## నూనెగింజల పంటలపై రైతులకు శిక్షణ



**ఎమ్మిగనూరు, ఆగస్టు 19(ప్రజా జ్యోతి ):** కృషి విజ్ఞాన కేంద్రం బనవాసిలో ఐసీఆర్-లర్ , హైదరాబాద్ ఆధ్వర్యంలో స్కస్ప్ కార్యక్రమం కింద ఎంపికైన 30 మంది రైతులకు నూనెగింజల పంటల సాగుపై శిక్షణ నిర్వహించారు. ఆముదం, వేరుశనగ పంటల్లో యాజమాన్య పద్ధతులు, బెట్ట పరిస్థితుల్లో పంటల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఐసిఆర్-లర్ స్కప్ నోడల్ అధికారి డా. ఎం. సురేష్ మాట్లాడుతూ, సుమారు 100 మంది రైతులకు ఐ సి హెచ్-5 ఆముదం హైబ్రిడ్ విత్తనాలు అందించామని తెలిపారు. బెట్ట పరిస్థితుల్లో 19:19:19 వంటి నీటిలో కరిగే ఎరువులను సిఫారసు చేసిన మోతాదులో పిచికారీ చేయాలని సూచించారు.కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. కె. రాఘవేంద్ర చౌదరి వేరుశనగలో కనిపిస్తున్న మొదలు కుళ్లు తెగులు నివారణకు తగిన శిలీంద్రనాశకాలు లేదా ట్రైకోడెర్మా విరిడీ వినియోగించాలని సూచించారు. రైతులు ఎస్ పి ఓ లుగా ఏర్పడి మార్కెటింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా ప్రయోజనం పొందాలని శాస్త్రవేత్త డా. వి. శ్రీచంద్ర సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## అనపాల అంజనేయుల రెడ్డికి 'ప్రైడ్ ఆఫ్ ఇండియా నేషనల్ అవార్డు 2026'



**కాకినాడ జిల్లా (ప్రజా జ్యోతి)** కాకినాడకు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త అనపాల అంజనేయులు రెడ్డికి 'ప్రైడ్ ఆఫ్ ఇండియా--నేషనల్ అవార్డు 2026' లభించింది. సామాజిక, ప్రజా సేవా రంగాల్లో విశేష సేవలు అందిస్తూ, ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న కృషి, సేవా కార్యక్రమాలు, నాయకత్వాన్ని గుర్తిస్తూ ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని ప్రదానం చేశారు.ఆగస్టు 13న హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. అనంతరం రాజమహేంద్రవరంలోని ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాన్ ఇండియన్ సోషల్ కల్చర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యం లో అద్దంకి రాజా యోనా సమక్షం లో 'కళారత్న' డాక్టర్ కొండా నరసింహారావు, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్పీ చేతుల మీదుగా అనపాల అంజనేయులు రెడ్డికి అవార్డును అందజేశారు.కాకినాడ రూరల్ ప్రాంతానికి చెందిన అంజనేయులు రెడ్డి ప్లాస్టిక్ సామగ్రి విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. తన వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రజా సేవకు వినియోగిస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ప్రతిరోజూ తాగునీటి సేవలు అందిస్తూ ప్రజల అభినందనలు పొందుతున్నారు. తనకు వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని సమాజ సేవకు కేటాయిస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన పలు సంస్థలు గతంలోనూ వివిధ పురస్కారాలతో సత్కరించాయి. తాజాగా 'ప్రైడ్ ఆఫ్ ఇండియా--నేషనల్ అవార్డు 2026' లభించడం పట్ల పలువురు సామాజిక సేవకులు, స్థానికులు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న అంజనేయులు రెడ్డి, తనకు లభించిన ఈ పురస్కారం మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు..

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు..కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

స్థానిక రాజ్యాధికారంలో బీసీలకు సువర్ణ అవకాశం
ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు: విజ్జిగిరి రవితేజ




**ఎటపాక, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా అత్యున్నత ప్రాధాన్యత కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని ఎటపాక కో క్లస్టర్ విజ్జిగిరి రవితేజ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని రవితేజ పేర్కొన్నారు. రిజర్వేషన్ల అమలుతో స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేసి బీసీలకు స్థానిక రాజ్యాధికారాన్ని తిరిగి అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృఢ సంకల్పంతో ఉన్నారని అన్నారు. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది బీసీ సామాజిక వర్గాలకు చెందిన యువత, మహిళలకు రాజకీయ రంగంలో ఎదిగేందుకు సువర్ణ అవకాశాన్ని కల్పిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లుగా ఎన్నికై ప్రజాసేవలో ముందుకు సాగేందుకు బీసీలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సామాజిక, రాజకీయ సాధికారతకు మరింత బలాన్ని చేకూరుస్తుందని రవితేజ అన్నారు. చారిత్రాత్మక నిర్ణయంతో బీసీల పక్షపాతిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి తన నిబద్ధతను నిరూపించుకున్నారని ఆయన పేర్కొన్నారు.

# మత్స్యకారుల ఆచూకీ కోసం హెలికాప్టర్లతో గాలించాలి

-కొల్లు త్రినాథ్ వర్మ
--ఒడలరేవు మత్స్యకారుల గల్లంతు ప్రభుత్వ వైఫల్యమే
--వెంటనే గాలింపు ముమ్మరం చేసి కుటుంబాలకు భరోసా ఇవ్వాలి
--బోట్లకు జీపీఎస్ పరికరాలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం
--మత్స్యకారుల అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వంలో ప్రత్యేక ప్రాధాన్యం
--అగ్నికుల క్షత్రియ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత జగన్‌కే
--ఫిషింగ్ హార్బర్లు,పోర్టుల నిర్మాణానికి జగన్ హయాంలోనే శ్రీకారం





**పఅంబేద్కర్ కోనసీమ జిల్లా ఆగస్టు 19(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)**అల్లవరం మండలం ఒడలరేవు గ్రామానికి చెందిన ఎనిమిది మంది మత్స్యకారులు బోట్లలో సముద్ర వేటకు వెళ్లి ఆచూకీ లేకుండా పోవడం ప్రభుత్వ వైఫల్యమేనని వైసీపీ రాష్ట్ర ఆర్టిఐ జోన్ 2 రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లు త్రినాథ వర్మ విమర్శించారు.గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రభుత్వం వెంటనే ప్రైవేటు హెలికాప్టర్లను రంగంలోకి దించి గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులను సురక్షితంగా గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించే వరకు ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలని కోరారు.బుధవారం ఒడలరేవు గ్రామంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను వైసీపీ అమలాపురం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పినిపే శ్రీకాంత్,వైసీపీ రాష్ట్ర ఆర్టిఐ జోన్ 2 వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లు త్రినాథ వర్మ,రాష్ట్ర కార్యదర్శి చెలిగొని శ్రీనివాసరావు,మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పెద్దలు,పార్టీ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మత్స్యకారులు సురక్షితంగా తిరిగి వస్తారని భరోసా కల్పించారు.వారి కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, కందిపప్పు,వంటనూనె తదితర నిత్యావసర సరుకులను అందించారు.ఈ సందర్భంగా త్రినాథ వర్మ మాట్లాడుతూ సముద్ర వేటకు ప్రతిరోజూ ఎన్ని బోట్లు వెళుతున్నాయి,ఎంతమంది మత్స్యకారులు సముద్రంలోకి వెళుతున్నారు,ఎంతమంది తిరిగి వస్తున్నారు,ఎంతమంది సముద్రంలోనే ఉండి వేట కొనసాగిస్తున్నారు అనే వివరాలను సంబంధిత శాఖలు ఎప్పటికప్పుడు సేకరించాల్సిన అవసరం ఉందన్నారు.మత్స్యకారుల కదలికలు,బోట్ల వివరాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని,ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే సంబంధిత కుటుంబాలకు సమాచారం చేరేలా సమర్థవంతమైన వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు.అయితే కూటమి ప్రభుత్వ హయాంలో ఈ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మత్స్యకారుల భద్రత కోసం బోట్లకు జీపీఎస్ పరికరాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ,వాటి అమలులో నిర్లక్ష్యం జరుగుతోందని ఆరోపించారు. బోట్ల కదలికలను నిరంతరం పర్యవేక్షించే విధంగా సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలు ఆందోళనలో ఉన్న సమయంలో ప్రభుత్వం స్పందించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గాలింపు చర్యలు చేపట్టాలని కోరారు. సముద్రంలో ప్రైవేటు సంస్థల కార్యకలాపాలు,డ్రిల్లింగ్ తదితర కారణాలతో సముద్ర జీవవైవిధ్యం,మత్స్యసంపదపై ప్రభావం పడుతోందని త్రినాథ వర్మ ఆందోళన వ్యక్తం చేశారు.మత్స్యసంపద తగ్గిపోవడంతో అగ్నికుల క్షత్రియ మత్స్యకారుల జీవనోపాధి ప్రమాదంలో పడుతోందన్నారు. మత్స్యకారుల జీవనోపాధిని కాపాడేందుకు ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మత్స్యకారుల అభివృద్ధి,సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చామని త్రినాథ వర్మ పేర్కొన్నారు.అగ్నికుల క్షత్రియుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఫిషింగ్ హార్బర్లు,పోర్టుల నిర్మాణానికి గత ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌తో పాటు ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం తదితర ప్రాంతాల్లో ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి గత ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. రామాయపట్నం, మచిలీపట్నం, నిజాంపట్నం, కాకినాడ గేట్‌వే వంటి పోర్టుల అభివృద్ధికి కూడా అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.బుడగట్లపాలెం, పూడిమడక బియ్యపుతిప్ప, కొత్తపట్నం,వాడరేవు తదితర ప్రాంతాల్లో మత్స్యకారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. మత్స్యకారులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ఫిషింగ్ హార్బర్లు,పోర్టుల నిర్మాణానికి పెద్దపీట వేసిందన్నారు.ప్రస్తుతం వాటిని ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన త్రినాథ వర్మ, ప్రైవేటీకరణతో వేలాది మత్స్యకార కుటుంబాల జీవనోపాధికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.అగ్నికుల క్షత్రియులకు కేవలం సామాజిక గుర్తింపు కల్పించడం మాత్రమే కాకుండా,వారి రాజకీయ,సామాజిక,ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు అవసరమన్నారు.అగ్నికుల క్షత్రియ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ కృషిని ఆ సామాజికవర్గం గుర్తించాలని కోరారు.అగ్నికుల క్షత్రియుల జాతిపిత లక్ష్మణస్వామి వర్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను స్వాగతిస్తున్నామని తెలిపారు.మత్స్యకారుల ప్రయోజనాలకు సంబంధించిన పోర్టులు,ఫిషింగ్ హార్బర్లను ప్రైవేటీకరించే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని త్రినాథ వర్మ డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణను కొనసాగిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ప్రస్తుతం గల్లంతైన ఒడలరేవు మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టి,వారు సురక్షితంగా కుటుంబాల వద్దకు చేరేలా చూడాలని డిమాండ్ చేశారు.

## "ప్రజా జ్యోతి వార్త" స్పందనతో... ఎమ్మెల్యే వసంత చేతుల మీదగా కవులూరు రహదారికి శంకుస్థాపన.....!!







ప్రజాజ్యోతి ఎఫెక్ట్

**జి.కొండూరు :( ఆగస్టు 19,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు):** ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండల పరిధిలో ని కవులూరు–శాంతినగర్ వరకు వెళ్లే రహదారి గుంటల పడి ఉండడంతో...ఈ రహదారిలో ప్రజలు నడవాలన్న, రైతులు పంట పొలాలకు వెళ్లాలన్న, పలు వాహనాలు ప్రయాణం చేయాలన్న,అనేక ఇబ్బందులు పడుతున్నారు.ఈ తరుణంలో "ప్రజా జ్యోతి" పత్రికలో ఈ రహదారి సమస్యపై ఆగస్టు 14 వ తారీకు న పత్రికలో ప్రచురించడం జరిగింది.ఈ రహదారి సమస్య పై స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ వెంటనే స్పందించి,కవులూరు గ్రామస్తుల,రైతుల కోరిక మేరకు ఈ రహదారి నిర్మాణం కోసం గ్రామపంచాయతీ శాఖ నుండి 1 కోటి 65 లక్షలు నిధులు మంజూరు చేయించి బుధవారం కవులూరు రహదారికి కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు తెలుగుదేశం పార్టీ నాయకులు,ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ కు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈ రహదారుల్లో నడవాలంటేనే భయపడి పోయామని,గత ప్రభుత్వం హయాంలో ఈ రహదారులను పట్టించుకోలేదని,కానీ నేడు శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు నిధులు మంజూరు చేయించి రహదారి నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం శుభపరిణామమని పలువురు గ్రామస్తులు,రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగానే ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు మెరుగుపడితే ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు,వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. అలాగే కవులూరు–శాంతినగర్ రహదారి నిర్మాణంతో గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని, ముఖ్యంగా వర్షాకాలంలో ఎదుర య్యే ఇబ్బందులు తగ్గుతాయని అన్నారు. అనంతరం పంచాయతీ శాఖ జే ఈ. రాఘవేంద్రరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణయ్య అలాగే జి.కొండూరు తహశీల్దార్ రిబ్కా రాణి,ఎంపీడీఓ శ్రీనివాసరావు, తదితర అధికారులతో ముచ్చటించి ఈ రహదారిని నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), సహకార సొసైటీ చైర్మన్ చేరుకూరి గంగాధరరావు, క్లస్టర్ ఇంచార్జ్ బోగ్ర అశోక్,తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ గొట్టుముక్కల వెంకటేశ్వరరావు,టిడిపి నాయకులు ఈలప్రోలు సాంబశివ రావు, గొట్టుముక్కల ఓంకార్,చెరుకూరి సాంబశివరావు, గ్రామ రైతులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మకం


### ఆర్.కృష్ణయ్య జాతీయ బీసీ సంఘం గౌరవ అధ్యక్షులు తుంగ నాగేశ్వరరావు.



**పోడూరు ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. ఆగష్టు 19.** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని బీసీ నాయకుడు, ఆర్.కృష్ణయ్య సంఘం గౌరవ అధ్యక్షుడు తుంగ నాగేశ్వరరావు అన్నారు. ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు బీసీల తరఫున అయన కృతజ్ఞతలు తెలిపారు.బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచడంతో పాటు సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు అధిక ప్రాతినిధ్యం లభించడం ద్వారా గ్రామస్థాయి నుంచే వారు రాజకీయంగా మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉంటుందని అయన పేర్కొన్నారు.దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హయాంలో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయని నాగేశ్వరరావు గుర్తుచేశారు. నాడు ఎన్టీఆర్ బీసీల అభ్యున్నతికి రిజర్వేషన్లతో బాటలు వేశారని నేడు చంద్రబాబు మరో అడుగు ముందుకు వేసి బీసీల రిజర్వేషన్ కోటాను 34 శాతానికి పెంచారని ఇది బీసీలకు ఎంతో సంతోషకరమని అయన పేర్కొన్నారు. బీసీల నుంచి ప్రజాప్రతినిధుల సంఖ్య పెరగడం వల్ల బీసీ వర్గాల సమస్యలను పాలనలో మరింతగా ప్రస్తావించే అవకాశం కలుగుతుందని తెలిపారు. బీసీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వారికి మరింత భరోసాకల్పిస్తున్నాయని అయన అన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని బీసీలకు అండగా నిలిచిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ లకు బీసీల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక న్యాయంలో భాగంగా బీసీలకు రాజకీయంగా, సామాజికంగా సముచిత స్థానం కల్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని స్వాగతిస్తున్నామన్నారు. బీసీల సంక్షేమం, అభివృద్ధికి ఇదే స్ఫూర్తితో మరిన్ని నిర్ణయాలు తీసుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తుంగ నాగేశ్వరరావు తెలిపారు.

## నూతన గృహ ప్రవేశంలో పాల్గొన్న మంత్రాలయం తెదేపా ఇంచార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి

రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్పగౌడ్ మరియు యువ నాయకులు సతీష్ నాయుడు, కౌతాళం మండలం తెదేపా అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు



**కౌతాళం ఆగస్టు 19 ప్రజా జ్యోతి** బుధువారం రోజున మంత్రాలయం నియోజకవర్గం మాధవరం,కోసిగి మండలం పల్లెపాడు, పెద్దకడుబురు మండలం చిన్నతుంబాళం గ్రామం నందు తెదేపా కుటుంబ సభ్యుల నూతన గృహ ప్రవేశ ఆహ్వానం మేరకు హాజరై నూతన గృహంలో ఆనందం,ఐశ్వర్యం మరియు సుఖశాంతులు నిండాలని మనస్ఫూర్తిగా కాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముత్తు రెడ్డి,అడివప్ప గౌడ్,పల్లెపాడు రామిరెడ్డి,బసలదొడ్డి ఈరన్న, గోపాల్ రెడ్డి మాలపల్లి వెంకటేష్,కోసిగి అయ్యన్న,దశరథ రాముడు,మాలపల్లి లక్ష్మయ్య, హరివిలి వీరేష్ లక్ష్మన్న,నరసప్ప,ఆంజనేయులు,తయన్న మొదలగు తెదేపా కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగినది.

## క్రీడలతో మానసిక ఉల్లాసం

- విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలి
- టిడిపి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు
- విద్యార్థుల క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తూ రూ.15 వేలు అందజేత



**పొందూరు ప్రజాజ్యోతి న్యూస్:**విద్యార్థులు క్రీడారంగంలో ఆసక్తి కనబరిచి క్రీడల్లో రాణించాలని జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు అన్నారు. పొందూరు మండలం రాపాక జెడ్పీహెచ్. ఎస్ స్కూల్ లో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఉపాధ్యాయ సిబ్బంది , పి.ఈ.టి ,స్కూల్ చైర్మెన్ కలిసి సమస్యను భాస్కర రావు దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి విద్యార్థుల క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు రూ.15 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ,శారీరక దృఢత్వానికి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా ముందంజలో ఉండాలన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పొందూరు మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ , మండల తెలుగు యువత అధ్యక్షులు కండాపు శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీఎం ఎస్‌సీఓఆర్ బళ్లారి--గుత్తి--ధర్మవరం సెక్షన్‌ను పరిశీలించిన రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్



**గుంతకల్లు ఆగస్టు 19 (ప్రజా జ్యోతి):** సౌత్ కోస్ట్ రైల్వే పరిధిలోని బళ్లారి--గుత్తి--ధర్మవరం సెక్షన్‌ను బుధవారం సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ పరిశీలించి, మౌలిక వసతులు, భద్రతా చర్యలు, ప్రయాణికుల సౌకర్యాలను సమీక్షించారు. పరిశీలన లో భాగంగా సందీప్ మాథుర్ హగరి వంతెనను సమగ్రం గా పరిశీలించారు. వంతెన నిర్మాణ స్థితి, భద్రతా అంశాలు, నిర్వహణ చర్య లను సమీక్షించి, రైళ్లను సురక్షితంగా, సమర్థవంతం గా నడిపేందుకు అవసరమై న చర్యలను పరిశీలించా రు. ఆయన వెంట గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ బి.ఎస్.కె. రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ మరియు టెలికాం ఇంజనీర్ ఓ.బి. సురేష్ కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ వినీత్ కుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్తా, డివిజన్‌కు చెందిన పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ గుత్తి, అనంతపురం, ధర్మవరం రైల్వే స్టేషన్లను పరిశీలించి, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న పనుల పురోగ తిని సమీక్షించారు. ప్రయాణికుల సౌకర్యాలు, మౌలిక వసతుల అభివృద్ధి లో భాగంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, వెయిటింగ్ హాళ్లు, తాగునీటి సౌకర్యాలు, యార్డ్ రీమోడలింగ్, ఇతర భద్రతా సంబంధిత పనుల ను పరిశీలించారు. ప్రయాణి కుల సౌకర్యాన్ని, స్టేషన్ల సమర్థవంతమైన నిర్వహ ణను మరింత మెరుగుపరి చేందుకు తగిన మార్పులు, అభివృద్ధి చర్యలను సూచించారు. ధర్మవరం వద్ద క్రూ లాబీని కూడా పరిశీలించి, అక్కడి సౌకర్యాలు, పని విధానాలను సమీక్షించారు. అదనంగా, సందీప్ మాథుర్ ప్రసన్నాయపల్లి వద్ద లెవల్ క్రాసింగ్ గేట్ నంబర్ 125ను పరిశీలించారు. అక్కడ గేట్‌మ్యాన్‌తో మాట్లాడి, భద్రతా పద్ధతులు, నిర్వహణ విధానాలు, పని పరిస్థితులపై ప్రత్యక్షంగా సమాచారం తెలుసుకున్నారు.గేట్ వద్ద చట్టబద్ధంగా నిర్వహించాల్సి న రిజిస్టర్ల నిర్వహణను, భద్రతా పరికరాల లభ్యత, వాటి పరిస్థితిని సమగ్రంగా పరిశీలించా రు. నిర్దేశించిన భద్రతా విధానాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచె ప్పారు. పరిశీలన సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ రైళ్ల సురక్షిత నిర్వహణతో పాటు సెక్షన్‌లో ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచడానికి నిరంతర పర్యవేక్షణ, సకాలంలో నిర్వహణ పనులు, భద్రతా నిబంధ నలను కచ్చితంగా పాటించడం అత్యంత అవసరమని సిబ్బందితో పేర్కొన్నారు.

## జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి అనంతపురం జిల్లా అధ్యక్షులుగా సురేష్ రెడ్డి నియామకం



గుంతకల్లు ఆగస్టు 19 (ప్రజా జ్యోతి): జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి అనంతపురం జిల్లా అధ్యక్షులుగా సురేష్ రెడ్డిని నియమించినట్లు జాతీయ చైర్మన్ తూము రామచంద్ర నాయుడు, జాతీయ వైస్ చైర్మన్, మరియు ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బి. ఎస్. కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులుగా నియమితు లైన సురేష్ రెడ్డి మాట్లాడు తూ నాకు ఈ అవకాశం ఇచ్చిన చైర్మన్ రామచంద్ర నాయుడు కి, వైస్ చైర్మన్ ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి.ఎస్ కృష్ణారెడ్డి కి, నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తు న్నానని అన్నారు. నాకు ఇచ్చిన ఈ పదవికి ఎటువంటి రాగద్వేషాలు సొంత లాభాలు ఆశించకుండా నిరంతరం మన సమస్త కోసం కష్టపడతానని, నా వలన సంస్థకు ఏ విధమైన అపకీర్తి తీసుకురానని జిల్లాలో ఎక్కడెక్కడ ఈ పోస్టులు ఖాళీ ఉన్నా వాటిని తొందర్లో నే భర్తీ చేస్తారని, దేశంలోనే మానవ హక్కుల పరిరక్షణ సమితి, అనంతపురం జిల్లా నే నెంబర్ వన్ గా నిలబెట్టి నందుకు నేటి నుంచి నేను కృషి చేస్తానని, తెలియజే శారు.

## కురాకులపల్లిలో భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ పరమాత్మ దివ్య దర్శనం



**కంబదూరు ఆగస్టు 19 :(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండలంలోని కురాకులపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీకృష్ణ విగ్రహ మహోత్సవాల్లో భాగంగా కురాకులపల్లి యాదవ సోదరులు, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన యాదవ సంఘం నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ పరమాత్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజశేఖర్ అనంతపురం యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, సత్యసాయి జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు లక్ష్మీ నరసప్పన్న, జిల్లా యాదవ సంఘం జిల్లా అధ్యక్షురాలు రాధా యాదవ్, ఆక్కులప్ప యాదవ్, రొద్దం జెడ్పీటీసీ, కుందుర్పి మాజీ ఎంపీపీ బెస్తరపల్లి సీనప్ప, కంబదూరు వైఎస్సార్‌సీపీ పార్టీ రూరల్ కన్వీనర్ కదిరిదేవరపల్లి గొల్ల హనుమంతరాయుడు, కురాకుల పల్లి మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, కురాకులపల్లి ఎంపీటీసీ నాగరాజు, సెట్టూరు మాజీ మండల కన్వీనర్ శివప్ప, లింగారెడ్డి, ప్రభాకర్, నరసింహ యాదవ్ తదితరులు హాజరై శ్రీకృష్ణ పరమాత్మను దర్శించుకున్నారు. కురాకులపల్లి యాదవ సోదరులు పెద్ద ఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో స్వామివారి దివ్య దర్శనం పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి శ్రీకృష్ణ పరమాత్మ ఆశీస్సులు పొందారు. శ్రీకృష్ణ విగ్రహ మహోత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. పరిసర గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు.

## అభివృద్ధి...సంక్షేమమే కూటమి ప్రభుత్వం ప్రధాన ధ్యేయం...!!

ఎమ్మెల్యే వసంత...!!





**జి.కొండూరు :( ఆగస్టు 19,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు):** ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ బుధవారం "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా జి.కొండూరు మండలంలోని కవులూరు గ్రామంలో పాల్గొన్నారు. కవులూరు గ్రామంలో ఇంటింటికీ వెళ్తూ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత స్థానిక ప్రజలతో ముచ్చటిస్తూ...ఏపీలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టిందని, అభివృద్ధి, సంక్షేమంతో ప్రభుత్వం దూసుకెళ్తున్నదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. అదే సమయంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, స్థానిక అవసరాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడమే "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు స్పష్టం చేశారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారా స్థానికంగా అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వవచ్చన్నారు. మైలవరం నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అమరావతి అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల్లో పురోగతి, పేదలకు సంక్షేమ పథకాల అమలు, భారీగా పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రధాని మోడీ ఆశీస్సులతో, సీఎం చంద్రబాబు సారథ్యంలో, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఏపీలో సమగ్రాభివృద్ధికి కృషి జరుగుతోందన్నారు. ఈ సందర్భంగానే కవులూరులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు కి స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మహిళలు, వృద్ధులు, యువతతో ఎమ్మెల్యే కృష్ణప్రసాదు గారు మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనంతగిరి పంచాయితీపశువుల యజమానులకు పంచాయతీ సూచన

### నిర్లక్ష్యం వహిస్తే పశువుల స్వాధీనం.

### కార్యదర్శి దేవా వెల్లడి.



**అనంతగిరి మండలం. ఆగస్టు19. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా.అనంతగిరిమండలం. అనంతగిరి పంచాయతీ గిరిజన వ్యవసాయ రైతులుపశువులను విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాలు.రోడ్లమీద విడిచి పెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే గ్రామ పంచాయతీ కఠిన చర్యలు తీసుకుంటుందని అనంతగిరి గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవా రైతులకు సూచించారు.కొంతమంది రైతులకు సంబంధించిన పశువులు ఇతర రైతుల పంట పొలాల్లోకి వెళ్లి నష్టపరుస్తున్నాయంటూ వచ్చిన ఫిర్యాదులపై పంచాయతీ నిర్ణయం తీసుకుంది. కార్యదర్శిదేవా మాట్లాడుతూచాలామంది రైతులు పశువులను సరైన పోషణ, కాపలా లేకుండా బయట విడిచిపెట్టడం వల్ల అటు రైతులకుఇటు ప్రజలకు, మూగజీవులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పశువులు ఇతర రైతుల పొలాల్లోకి చొరబడి పంటలను నాశనం చేస్తున్నాయి.రాత్రి వేళల్లో పశువులు మండల కేంద్రానికి వచ్చి రోడ్డుకు అడ్డంగా పడుకోవడం వల్ల వాహనదారులకు ఇబ్బంది కలుగుతోంది. కొన్నిసార్లు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం కూడా సంభవిస్తోంది. సరైన సంరక్షణ లేక పశువులు జబ్బుపడి మండల కేంద్రంలోనే చనిపోయిన సందర్భాలు ఉన్నాయికాబట్టి ఇకపై పశువులను నిర్లక్ష్యంగా బయటకు వదిలేసే యజమానులపై కింది విధంగా చర్యలు ఉంటాయని కార్యదర్శి స్పష్టం చేశారు.నిబంధనలు ఉల్లంఘిస్తే మొదటిగా మూడు సార్లు నోటీసు ద్వారా హెచ్చరించడం జరుగుతుందనిఅప్పటికీ యజమానుల తీరు మారకపోతే సదరు పశువులను గ్రామ పంచాయతీ స్వాధీనం చేసుకునిసంబంధిత పశువుల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.



అనంతగిరి పంచాయతీపశువుల యజమానులు నోటీసులను గమనించి,పశువులకు సరైన కాపలా ఏర్పాటు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి దేవా విజ్ఞప్తి చేశారు.

# సత్తిబాబు కుటుంబానికి అండగా టీడీపీ ప్రమాద బీమా

--ప్రమాద బీమాతో కుటుంబానికి రూ.5 లక్షల భరోసా.

--బీమా క్లెయిమ్ పరిష్కారానికి ఎంపీటీసీ కరకా వెంకటరమణ ప్రత్యేక చొరవ.

--కుటుంబానికి అండగా నిలిచిన పార్టీ నాయకత్వానికి రామలక్ష్మి కృతజ్ఞతలు.



**మోతిగూడెం ప్రజాజ్యోతి ఆగస్టు 19** :మండలం లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త చిక్కుడు సత్తిబాబు కుటుంబానికి పార్టీ కార్యకర్తల కోసం అమలు చేస్తున్న ప్రమాద బీమా పథకం ద్వారా రూ.5 లక్షల పరిహారం మంజూరైంది. నామినీగా ఉన్న సత్తిబాబు భార్య చిక్కుడు రామలక్ష్మి బ్యాంకు ఖాతాలో బీమా మొత్తం జమ అయినట్లు సంబంధిత బీమా సంస్థ ధ్రువీకరించింది.గత ఏప్రిల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిక్కుడు సత్తిబాబు అకాల మరణం చెందారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేష్ పార్టీ కార్యకర్తల కోసం ఏర్పాటు చేసిన ప్రమాద బీమా పథకం కింద సత్తిబాబు కుటుంబానికి పరిహారం మంజూరైంది. బీమా క్లెయిమ్‌కు సంబంధించిన అధికారిక ధ్రువీకరణ పత్రాన్ని దొంకరాయి ఎన్‌టీఆర్ భవన్ వద్ద స్థానిక ఎంపీటీసీ కరకా వెంకటరమణ లబ్ధిదారు రామలక్ష్మి, కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబానికి అండగా నిలిచిన పార్టీ పేద కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా అమలు చేస్తున్న ప్రమాద బీమా పథకం ద్వారా రూ.5 లక్షల సహాయం అందడంపై సత్తిబాబు కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామలక్ష్మి మాట్లాడుతూ.. తమలాంటి పేద కార్యకర్తల కుటుంబాలకు ఇంతటి ఆర్థిక భరోసా కల్పించిన నారా లోకేష్‌కు, ప్రమాదం జరిగిన సమయంలో అన్నివిధాలా సహాయం అందించిన ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తన భర్త మృతి చెందిన నాటి నుంచి తమ కుటుంబానికి అండగా ఉంటూ బీమా క్లెయిమ్ ప్రక్రియ సకాలంలో పూర్తయ్యేలా ఎంపీటీసీ కరకా వెంకటరమణ ప్రత్యేక చొరవ చూపారని రామలక్ష్మి తెలిపారు. అధికారుల నుంచి అవసరమైన ధ్రువపత్రాలు సమకూర్చడంతో పాటు సంబంధిత కార్యాలయాల్లో క్లెయిమ్ ప్రక్రియను అనుసరించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో నాలుగుసార్లు సొంత ఖర్చులతో మంగళగిరికి వెళ్లి పార్టీ కార్యాలయ పెద్దలను సంప్రదించారని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో తమను సొంత కారులో మంగళగిరికి తీసుకెళ్లి, తమపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా క్లెయిమ్ పరిష్కారమయ్యే వరకు అండగా నిలిచారని రామలక్ష్మి పేర్కొన్నారు.ఎంపీటీసీ కరకా వెంకటరమణ మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చిక్కుడు సత్తిబాబు నిబద్ధత కలిగిన కార్యకర్త అని, ఆయన కుటుంబానికి అండగా నిలవడం తన బాధ్యతగా భావించానని తెలిపారు. కార్యకర్తకు కష్టం వచ్చినప్పుడు పార్టీ, స్థానిక నాయకత్వం వారి వెంట ఉండాలనే ఉద్దేశంతోనే బీమా క్లెయిమ్ ప్రక్రియను నిరంతరం అనుసరించినట్లు చెప్పారు. పార్టీ నుంచి బాధిత కుటుంబానికి రావాల్సిన ప్రయోజనం అందే వరకు తన వంతు సహకారం అందించానన్నారు. కుటుంబానికి రావాల్సిన ఇతర క్లెయిమ్‌లు కూడా పూర్తిగా అందే వరకు తన పోరాటం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు నీలాపు సత్యనారాయణ, గంగిరెడ్ల గురుమూర్తి, మద్దెల యాకోబు, కర్రి నర్సింహామూర్తి, లింగారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నాగ్ జయదాస్, మండల క్లస్టర్ కరకా ప్రేమకిరణ్, చిక్కుడు చిన్నారావు, పీరి మంగమ్మ, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రిక్షా కార్మికుడి కుటుంబానికి 'జనతా ఫౌండేషన్' రూ.10 వేల ఆర్థిక సాయం

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఫౌండేషన్ అధినేత జమ్మూ



**కాకినాడ జిల్లా (ప్రజా జ్యోతి)** పిఠాపురం టౌన్ కత్తులగూడెం గ్రామానికి చెందిన నిరుపేద, రిక్షా కార్మికుడు గోకివాడ రాంబాబు కుటుంబానికి 'జనతా ఫౌండేషన్' అండగా నిలిచింది. గత కొంతకాలంగా రాంబాబు 'లిపోసార్కోమా' అనే తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. వ్యాధి తీవ్రత వల్ల ఆయన ఏ పనీ చేయలేక, రాబడి లేక కనీసం ఇంటి అద్దె కూడా కట్టలేని అత్యంత దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ విషయాన్ని స్థానికుడు తమ్ముడు లోకేష్ 'జనతా ఫౌండేషన్' దృష్టికి తీసుకువెళ్లారు. బాధిత కుటుంబ పరిస్థితిపై తక్షణమే స్పందించిన జనతా ఫౌండేషన్ అధినేత జమ్మూ.. బాధితుని నివాసానికి స్వయంగా వెళ్లి పరామర్శించారు. ఆ కుటుంబానికి ధైర్యం చెబుతూ, ఫౌండేషన్ తరఫున రూ. 10,000 తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడమే జనతా ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మానవత్వంతో స్పందించి ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన ఫౌండేషన్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ సతీష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకె జగదీష్, చెక్కపల్లి వినయ్, ఫౌండేషన్ ప్రతినిధులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 3ను వెంటనే పునరుద్ధరించి చట్టబద్ధత కల్పించేందుకు శాసనసభలో తీర్మానం చేయాలి

-- ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్




**కూనవరం ఆగస్టు 19. ప్రజా జ్యోతి** కూనవరం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు సున్నం రాజులు, పులి సంతోష్ పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ, ప్రస్తుతం వర్షాకాల శాసనసభ సమావేశాలు జరుగుతున్న తరుణంలోనే జీవో నెంబర్ 3ను వెంటనే పునరుద్ధరించి, చట్టబద్ధత కల్పించేలా శాసనసభలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు జీవనాధారంగా ఉన్న జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఇప్పటికే పాడేరు, సీతంపేట, కేఆర్‌పురం, రంపచోడవరం వంటి జిల్లా కేంద్రాల్లో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు, ముట్టడి కార్యక్రమాలు జరిగాయని తెలిపారు.అలాగే కూనవరం మండలంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు అన్ని వర్గాల ప్రజలు, ఆదివాసీ యువతీ యువకులు మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ దీక్షలకు సంఘీభావం తెలిపిన ఎంపీపీ పాయం రంగమ్మ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని అన్నారు. ఇటీవల జరిగిన ఆదివాసీ ఉద్యమాల నేపథ్యంలో ఇచ్చిన హామీలను కూడా రాష్ట్ర మంత్రి సంధ్యారాణి వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఆదివాసీల హక్కులపై ప్రభుత్వాలు చేస్తున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని, గిరిజన మంత్రులు, ఎమ్మెల్యేలు చట్టసభల్లో ఆదివాసీల సమస్యలపై గళం విప్పాలని కోరారు. ఆదివాసీ ప్రాంతాల్లో నివసిస్తున్న స్థానిక ఆదివాసీ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో 100 శాతం స్థానిక ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.జీవో నెంబర్ 3 పునరుద్ధరణ కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆదివాసీ ప్రజలంతా ఐక్యంగా మద్దతు ఇవ్వాలని ఆదివాసి గిరిజన సంఘం పిలుపునిచ్చింది ఈ దీక్షలు పాల్గొన్న ఎంపీటీసీలు ధర్మలు అమ్మాజీ కారం జయసుధ మాజీ సర్పంచులు మడకం నాగమణి బోగ్గ వెంకమ్మ గుండం బుచ్చమ్మ ఆదివాసిగిరిజన సంఘ నాయకులు పాయం సీతారామయ్య బాబు బోరయ్య తెల్లం తమ్మయ్య పాయం సత్యనారాయణ మడెం బాబు మడకం సత్యనారాయణ చిచ్చడి సత్యనారాయణ వియిక కన్నయ్య తదితరులు పాల్గొన్నారు

# సోషల్ మీడియా ఎంత ఉపయోగమో అంతకంటే ఎక్కువ ప్రమాదం

సైబర్ క్రైమ్,మోసాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి......

మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనదారుడిపై,తల్లిదండ్రులపై కఠిన చర్యలు......

ఎటపాక సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ....





**కూనవరం,ఆగష్టు19. ప్రజా జ్యోతి** సోషల్ మీడియా పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సోషల్ మీడియా ఎంత ఉపయోగమో దాని వల్ల అంతకంటే ప్రమాదం ఉందని ఎటపాక సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ కూనవరం ఎస్ఐ రామకృష్ణ టేకులబోరు ఎస్సీ కాలనీలో విలేజ్ విసిటింగ్ చేసి అక్కడ ఉన్న ప్రజలకు సైబర్ క్రైమ్ నేరాల మీద ఫేస్బుక్లో జరిగే నేరాలు మీద వాట్సాప్,ఇన్స్టాగ్రాముల వల్ల జరిగే మోసాల మీద మరియు ఇతర విషయాలపై అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం జగ్గవరం క్రాస్ రోడ్ లో వాహనాల తనిఖీ చేసి వాహనదారుల నుంచి లైసెన్స్, హెల్మెంట్, ఇన్సూరెన్స్ లేని వారిపై, ఫైన్స్ వేయడం జరిగింది. సీఐ కృష్ణ మాట్లాడుతూ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్క వాహనదారుడు లైసెన్స్,హెల్మెంట్, ఇన్సూరెన్స్, తప్పనిసరిగా కలిగి ఉండాలని అదేవిధంగా మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానిపై తల్లిదండ్రుల పై చర్యలు తీసుకుంటామని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చాలా ప్రమాదమని ఇంట్లో మీకోసం ఎదురుచూసే భార్య పిల్లలు ఉంటారని మద్యం సేవించి వాహనం నడిపే ముందు ఒక్కసారి ఆలోచించాలని వాహనదారులకు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కూనవరం ఎస్సై రామకృష్ణ పోలీస్ సిబ్బంది వాహనదారులు ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యో పాపం తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ఆడపిల్లలు!

మూడు నెలల క్రితం తల్లి.. ఇప్పుడు తండ్రి మృతి ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు, బంధువుల వేడుకోలు

10వ తరగతి చదువుతున్న మమత, 5వ తరగతి చదువుతున్న మానస కన్నీటి పర్యంతం

ఇంతవరకు అందని 'తల్లికి వందనం' సాయం.. మా చదువులకు దిక్కెవరంటూ రోదన



**హాలహర్వి మండలం ఆగస్టు 19, ప్రజాజ్యోతి :-** విధి ఆ పసి హృదయాలపై తీవ్ర కక్ష కట్టింది. కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్నతల్లిని మూడు నెలల క్రితమే దూరం చేసిన విధి.. ఇప్పుడు తండ్రినీ అనారోగ్యంతో బలితీసుకోవడంతో ఆ ఇద్దరు ఆడపిల్లలు కళ్లముందే దిక్కుతోచని అనాథలుగా మారిపోయారు మండల కేంద్రమైన హాలహర్విలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

**వరుస విషాదాలు రోడ్డున పడ్డ ఆడబిడ్డలు**

హాలహర్వి మండల కేంద్రం లో ఎస్సీ కాలనీకి చెందిన జి. విశ్వనాథ, వరలక్ష్మి దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు సంతానం. మొదటి కూతురు జి. మమత (14) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతుండగా, రెండో కూతురు జి. మానస (10) ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. తల్లి వరలక్ష్మి గత ఐదేళ్లుగా పక్షవాతంతో మంచానికే పరిమితమై, నరకయాతన అనుభవించి మూడు నెలల క్రితమే కన్నుమూసింది. తల్లి లేని లోటు తెలియకుండా తండ్రి విశ్వనాథే తానే తల్లై, తండ్రియై రెక్కల కష్టంతో ఆ ఇద్దరు ఆడపిల్లలను ఎంతో గారాబంగా సాకుతూ వచ్చాడు. అయితే విధి మరోసారి వంచించింది. అకస్మాత్తుగా తీవ్ర అనారోగ్యానికి గురైన విశ్వనాథ మంగళ వారం సాయంత్రం తుదిశ్వాస విడిచాడు. భార్య చనిపోయిన మూడు నెలల వ్యవధిలోనే భర్త కూడా మృతి చెందడంతో ఆ చిన్నారులు ఒక్కసారిగా ఒంటరైపోయారు.

**అందని 'తల్లికి వందనం' మాకు దిక్కెవరు:**

బడికి వెళ్లే ఇద్దరు ఆడపిల్లలకు ప్రభుత్వం నుండి రావాల్సిన 'తల్లికి వందనం' ఆర్థిక సాయం కూడా ఇంతవరకు అందలేదని కుటుంబ సభ్యులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల మృతదేహాల వద్ద "ఇక మాకు ఎవరు దిక్కు. మా చదువులు ఎలా సాగాలి" అంటూ చిన్నారులు మమత, మానస రోదిస్తున్న తీరు అక్కడున్న వారి చేత కంటతడి పెట్టించింది. ఇద్దరూ మైనర్ ఆడపిల్లలు కావడంతో వారి పోషణ, పైచదువు ల భారం ఎవరు భరిస్తారని ఆందోళన చెందుతున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ అధికారులు మరియు ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించి ఆదుకోవాలని గ్రామస్తులు చేతులెత్తి వేడుకుంటున్నారు..

# సార్ ఈ వార్తను రెండు ఫోటోలతో ప్రచురణ చేయగలరు





అత్యంత వైభవంగా జైన్ దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన

శాస్త్రవేత్తంగా రెండు గంటలు పైబడి పూజలు

పూజలు ముగిసే సమయానికి కరుణించిన వరుణుడు

గ్రామపెద్దలు, గ్రామస్తుల రాకతో అట్టహాసంగా శంకుస్థాపన వేదిక

ఆచంట ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో పూజలు

పితాపురం శీతలనాద్ జైన్ సంఘం ఆర్థిక సాయంతో దేవాలయ నిర్మాణం

**ప్రజాజ్యోతి (పోడూరు), - ఆగస్టు -19 :** దేవుని కార్యానికి అందరూ పెద్దలే.. అందుకునే కాబోలు పోడూరు గ్రామపెద్దలు గ్రామస్తులు పోటెత్తిన ఆ శుభకార్యం వరుడు సైతం కరుణించి వర్షించాడు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరులో జైన్ దేవాలయ నిర్మాణం బుధవారం అత్యంత వైభవోపేతంగా జైన్ దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జైన్ గురువులు శాస్త్రోత్తంగా మంత్రోచ్ఛరణ నిర్వహించారు. ఆచంటకు చెందిన పద్మప్రభూస్వామి జైన్ దేవాలయం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆశీస్సులతో పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. పితాపురం శీతలనాధ్ జైన్ సంఘం ఆర్థిక సాయంతో నిర్మించనున్న దేవాలయం శంఖుస్థాపన నకార్యక్రమానికి పోడూరు పరిసర గ్రామాల ప్రజలు విచ్చేసి జైన్ దేవుని (సుమతినాథ్) మరియు గురువుల ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో టిడిపి పోడూరు మండల అధ్యక్షుడు రుద్రరాజు రమేష్ రాజు, పోడూరు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు రుద్రరాజు వరహాలరాజు, రుద్రరాజు శివరామరాజు (శివ), పోడూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు చేకూరి సూర్యనారాయణరాజు (సూరిబాబు), వైద్యులు పోడూరు కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణ రాజు, ఆచంట ఏఎంసి డైరెక్టర్ బండి సత్యనారాయణ, పోడూరు సొసైటీ త్రీసభ్య కమిటీ సభ్యుడు తోలేటి వేణు, రాయుడు సుబ్బారావు ముప్పన సూర్యనారాయణ, గ్రామస్తులు, జైన్ దేవుని భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నక్కన దొడ్డి, గ్రామాలలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఏర్పాటు



**గుంతకల్లు ఆగస్టు 19 (ప్రజా జ్యోతి):** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మరియు అనంతపురం జిల్లా ఇంచార్జ్ చిన్న సుబ్బారావు మాదిగ మరియు కో ఇంచార్జ్ కోళ్ల కళ్యాణ్ మాదిగ సూచన మేరకు నూతన గ్రామ కమిటీల ప్రక్రియలో భాగంగా బుధవారం గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ గుంతకల్లు మండల అధ్యక్షుడు రాజు మాదిగ ఆధ్వర్యంలో నక్కల దొడ్డి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామంలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాదిగ రాజు మాదిగ మాట్లాడుతూ గ్రామ కమిటీలు వేసి 32 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ పోరాటం చేసి ఏబిసిడి ఎస్సీ వర్గీకరణ సాధించడం జరిగింది. వర్గీకరణ ఫలాలు మనమం తా అనుభవించాలంటే మన పిల్లలను ఉన్నత చదువులు చదివించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని ఉద్యోగాలు వచ్చేవరకు మందకృష్ణ నాయకత్వంలో మీరు భాగస్వాములై మీ వంతు పోరాటం చేయాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల గౌరవ అధ్యక్షులు లోకేంద్ర మాదిగ, మండల ప్రధాన కార్యదర్శి జయరామ్ మాదిగ, కసాపురం మాజీ అధ్యక్షులు మోహన్ మాదిగ, కసాపురం మాజీ ఉపాధ్యక్షులు రమేష్ మాదిగ, సాయి మాదిగ, రామాంజనేయులు మాదిగ, బీరప్ప, అనీలు, నాగరాజు మరియు మహిళా నాయకురాలు లక్ష్మీదేవి, ఈరమ్మ, ఆదెమ్మ, సువర్ణమ్మ, నాయకులు మరియు మహిళ నాయకులురాలు పాల్గొనడం జరిగింది.

## రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా కొణిదెల నాగబాబు

**- శుభాకాంక్షలు తెలిపి తూర్పు కాపు రాష్ట్ర అధ్యక్షులు,జనసేన పార్టీ నాయకులు మక్కా సాయిబాబు నాయుడు**



**జి సిగడాం , ప్రజాజ్యోతి న్యూ స్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మెన్ గా కొణిదెల నాగబాబు క్యాబినెట్ హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది ఈ మేరకు రాష్ట్ర క్యాబినెట్ హోదా కల్పిస్తూ రాష్ట్ర చైర్మెన్ గా నియమించినందుకు ఆయనకు జనసేన పార్టీ నాయకులు తూర్పు కాపు రాష్ట్ర అధ్యక్షులు మక్కా సాయిబాబు నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా సాయిబాబు నాయుడు మాట్లాడుతూ నాగబాబుకు కీలకమైన బాధ్యతలు అప్పగించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ఆయన నాయకత్వంలో పర్యావరణ పరిరక్షణతో పాటు రాష్ట్రంలో హరితాభివృద్ధికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.నాగబాబుకు లభించిన ఈ పదవితో ఎచ్చెర్ల నియోజకవర్గానికి కూడా మరింత ప్రయోజనం చేకూరుతుందని, నియోజక వర్గం అభివృద్ధిమరింత ముందుకు సాగుతుందని సాయిబాబు నాయుడు ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నాగబాబు తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తారనే నమ్మకం ఉందన్నారు.

## ఉన్నత సేవలతో ఉత్తమ గుర్తింపు: కారుణ్య ట్రస్ట్ చైర్మన్ నాగేశ్వరరావు



**ప్రజాజ్యోతి, (పోడూరు), ఆగస్టు 19:** విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందిస్తే ఉత్తమ గుర్తింపు పొందవచ్చుని, ఆ దిశగా రావాడ ఉమామహేశ్వరరావు అగ్నిమాపక డిపార్ట్మెంట్లో డి ఓ పి గా నిబద్ధత, అంకిత భావం గుర్తింపుగా అన్ సాగ్ హీరో అవార్డుతో సన్మానింపబడడం అభినందనీయమని కారుణ్య ట్రస్ట్ చైర్మన్ తుంగా నాగేశ్వరరావు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాలి మండలం కోటబొమ్మాలి అగ్నిమాపక స్టేషన్ లో బుధవారం డిఓపిగా పనిచేస్తున్న రావాడ ఉమామహేశ్వరరావు సన్మాన కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి జే.మోహనరావు, జిల్లా ఉప అగ్నిమాపక అధికారి కె. శీనుబాబు లతో కలిసి సన్మాన గ్రహీతను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కారుణ్య ట్రస్ట్ అధినేత తుంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్నిమాపక డిపార్ట్మెంట్ లో విధి నిర్వహణ ప్రాణాపాయమని స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగి ప్రమాదాలను లెక్కచేయకుండా పనిచేయాల్సి ఉందన్నారు. ప్రమాదం సంభవించినప్పుడు ఆలస్యం, ఏమరపాటు, భయం వీడి తక్షణం ప్రాణాలు సైతం లెక్కచేయకుండా విధులను బాధ్యతాయుతంగా పనిచేసే ప్రతి ఉద్యోగి సేవలు మరువలేనివి అని, స్మరణీయమని పేర్కొన్నారు.

## 22 -ఏ భూ సమస్యలకు పరిష్కారం దిశగా ప్రత్యేక మేళా ఆర్డిఓ కే ఆనందరావు



**తాళ్లపూడి, ఆగస్టు 19, ప్రజాజ్యోతి న్యూస్** కొవ్వూరు డివిజన్ పరిధిలో ఉన్న 22-ఏ నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న ప్రత్యేక 22-ఏ మేళా నిర్వహించనున్నట్లు కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. ఆనందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్ట్ 22 శనివారం ఉదయం 11 గంటల నుంచి కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ఈ మేళా జరుగుతుందని పేర్కొన్నారు. కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 22-ఏ నిషేధిత జాబితా భూములకు సంబంధించిన సమస్యలపై అర్జీదారులు అవసరమైన పత్రాలతో మేళాకు హాజరై దరఖాస్తులు సమర్పించవచ్చని ఆర్డీవో తెలిపారు

# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన




**ప్రజాజ్యోతి ఆగస్టు 19 ఖాజీపేట:** మండలంలోని తుడుముల దిన్నె గ్రామంలో ఏరువాక కేంద్రం, కడప సమన్వయకర్త డా. ఎన్. కృష్ణ ప్రియ ఆధ్వర్యంలో రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో ఎల్‌నినో ప్రభావం, పత్తి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఎన్. కృష్ణ ప్రియ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతం లోటు, వాతావరణ అనిశ్చిత పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. రైతులు పత్తి పంటలో నీటి, పోషక, కలుపు యాజమాన్యంతో పాటు పురుగులు, తెగుళ్ల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలను వినియోగించి, సిఫార్సు చేసిన రకాలను ఎంపిక చేసుకుని సరైన సమయంలో విత్తుకోవాలని తెలిపారు. పురుగులు, తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి శాస్త్రీయంగా సిఫార్సు చేసిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని సూచించారు. వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలను పాటిస్తూ పంటలను రక్షించుకోవాలని తెలిపారు. రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ ఎం. ప్రకాష్ రైతులకు సంస్థ అందిస్తున్న వ్యవసాయ సేవలు, ఉపయోగకరమైన సమాచారాన్ని వివరించారు. కార్యక్రమంలో తుడుములదిన్నె గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా ఈరన్న స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి,టీటీడీ మాజీ పాలక మండల సభ్యులు వై. సీతారామరెడ్డి




**కౌతాళం ఆగస్టు 19 ప్రజాజ్యోతి** కౌతాళం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద శ్రీ లక్ష్మీనరసింహ ఈరన్న స్వామివారిని శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి,సోదరుడు టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు వై. సీతారామీరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు,ఆలయ డిప్యూటీ కమీషనర్ వాణి అర్చకులతో పూర్ణకుంభం తో ఆలయంలోకి స్వాగతం పలికారు,స్వామివారికి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు దర్శనం అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యే మరియు కుటుంబసభ్యులకు గౌరవప్రదంగా సత్కరించడం జరిగింది,ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి శ్రావణమాసం సందర్భంగా చేపట్టిన చర్యలను ఎమ్మెల్యేకి చూపిస్తూ వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో,మండల కన్వీనర్ ప్రహ్లాద ఆచారి,వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మంత్రాలయం నాయకులు పురుషోత్తం రెడ్డి, వెంకట్రాంరెడ్డి, మాజీ సర్పంచ్ పాల్ దినకర్, భాష,వడ్డెరాము, రమేష్ ఆదిరెడ్డి, మూకన్న,తదితర నాయకులు పాల్గొన్నారు.

# మధురమైన జ్ఞాపకాలను భద్రపరిచే గొప్ప కళ ఫోటోగ్రఫీ

గిరి కుమార్

**పెనుమదంలో ఘనంగా ఫోటోగ్రఫీ డే వేడుకలు**
**సాంకేతికతతో ఫోటోగ్రఫీలో పెనుమార్పులు**
**సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని మరింత అభివృద్ధి**
**ఫోటోగ్రాఫర్ల సేవలు అభినందనీయం**
**ఫోటోగ్రాఫర్లకు ప్రభుత్వం ప్రోత్సహించాలి**



**ప్రజాజ్యోతి (పోడూరు), - ఆగస్టు -19 :** మధుర జ్ఞాపకాలను భద్రపరిచే గొప్పకలే ఫోటోగ్రఫీ అని పేర్కొన్నారు. ఫోటోగ్రఫీ డే సందర్భంగా పెనుమదంలో ఫోటోగ్రఫీ రంగానికి చెందిన ఫోటోగ్రాఫర్లు, స్టూడియో నిర్వాహకులు మరియు ఫోటోగ్రఫీ అభిరుచి కలిగిన వారి సమక్షంలో ప్రత్యేక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దొమ్మేటి గిరి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఫోటోగ్రఫీ డే వేడుకలను నిర్వహించడంతో పాటు ఫోటోగ్రఫీ రంగంలో సేవలందిస్తున్న ఫోటోగ్రాఫర్లను అభినందించారు. ఈ సందర్భంగా దొమ్మేటి గిరి కుమార్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ ఓ అద్భుత ప్రపంచమని, ఫోటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు అన్నారు. ఫోటోగ్రఫీ అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాకుండా, జీవితంలోని మధురమైన జ్ఞాపకాలను శాశ్వతంగా భద్రపరిచే గొప్ప కళ అని అన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఫోటోగ్రఫీ రంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఫోటోగ్రాఫర్లు మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో జరిగే వివాహాలు, శుభకార్యాలు, పండుగలు, సామాజిక కార్యక్రమాల ను తమ కెమెరాల ద్వారా అందమైన జ్ఞాపకాలుగా మలుస్తున్న ఫోటోగ్రాఫర్ల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఫోటోగ్రఫీ రంగంపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం మరియు సమాజం నుంచి మరింత ప్రోత్సాహం అందాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఫోటోగ్రఫీ రంగంలో ప్రతిభ కనబరుస్తున్న వారిని సత్కరించి, ఫోటోగ్రఫీ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఫోటోగ్రాఫర్లు, స్టూడియో నిర్వాహకులు, యువ ఫోటోగ్రాఫర్లు, ఫోటోగ్రఫీ అభిరుచి కలిగిన వారు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎంటమాలజిస్ట్ పి. కొండారెడ్డి ఆకస్మిక తనిఖీ



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 19 (ప్రజా జ్యోతి)** రాష్ట్ర ఎంటమాలజిస్ట్ పి. కొండారెడ్డి కలసపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆయన ల్యాబొరే టరీలోని అన్ని రకాల రికార్డులను, నివేదికలను నిశితంగా పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఆరోగ్య కార్యకర్తలు (ఏఎన్ఎంలు), పురుష ఆరోగ్య సహాయకులు సేకరించిన రక్త నమూనాలను (యాక్టివ్ బ్లడ్ శాంపిళ్లను), వారి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ, లార్వాసర్వే, జ్వరాల సర్వేలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. అలాగే ల్యాబ్ టెక్నీషియన్లకు మలేరియా స్లైడ్ పరీక్షల నిర్వహణ పైపలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో స్టేట్ ఎంటమాల జిస్ట్‌తో పాటు సబ్-యూనిట్ ఆఫీసర్ టి. నరసింహారెడ్డి పాల్గొని, జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమ ప్రగతిని పి. కొండారెడ్డికి పూర్తి స్థాయిలో వివరించారు. ఈ కార్యక్రమంలో స్థాని క వైద్యులు సాయితేజ, ల్యాబ్ టెక్నీషియన్లు స్వాతి, ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు రామతీర్థం, జయరామిరెడ్డి, సాధు సత్యనారా యణస్వామిరంగయ్య మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## దిగజారుడు రాజకీయం మానుకో తోట రామకృష్ణను హెచ్చరించిన టిడిపి మండల అధ్యక్షుడు సిద్ధా దుర్గాప్రసాద్

**అసత్య ప్రచారాలు చేసి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేయవద్దు**



**తాళ్లపూడి, ఆగస్టు 19, ప్రజాజ్యోతి న్యూస్** డీఎస్సీలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ చేపట్టిన నిరసనలకు వెళ్లనివ్వకుండా పోలీసులు గృహనిర్బంధం చేశారని, ఇంటి వద్ద పోలీసులు ఉండటంతో తన పరువు పోయిందంటూ తోట రామకృష్ణ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం అత్యంత హాస్యాస్పదమని టీడీపీ తాళ్లపూడి మండల అధ్యక్షుడు సిద్దా దుర్గాప్రసాద్ మండిపడ్డారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైసీపీ నేతలు ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ నేతలు, కార్యకర్తలు ఒక్క నిరసనలకు వెళ్ళనివ్వకుండా మమ్మల్ని మా పార్టీ శ్రేణులను తెల్లవారుజామునే ఇళ్లలో పోలీసులతో గృహనిర్బంధాలు చేశారని అప్పుడు మా మనోభావాలు దెబ్బతినలేదా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినా రోడ్డెక్కి పోరాడమని అంతేగాని ఇలా కలెక్టర్ దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేయలేదని ఇప్పుడు మీరు చేసేది బలహీనతకు నిదర్శనం అని సిద్దా దుర్గాప్రసాద్ అన్నారు. డీఎస్సీ ప్రక్రియను కూటమి ప్రభుత్వం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించి వేలాదిమంది అభ్యర్థుల కలలను నెరవేర్చిందని తెలిపారు. దీన్ని చూసి ఓర్వలేకనే వైసీపీ నేతలు అసత్య ప్రచారాలు చేసి యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని ఇకపై ఇలాంటి బూటకపు నిరసనలు, నాటకాలు ఎవరూ నమ్మరని హెచ్చరించారు

## శ్రీకాకుళం జిల్లాలోను ఆదరణ పొందుతున్న తుంగ నాగేశ్వరరావు



**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం.ఆగష్టు 19.** సమాజ సేవా కార్యక్రమాల పట్ల తనకున్న నిబద్ధతతో పశ్చిమ గోదావరి జిల్లా, ఆచంట మండలం, గుంపర్రు గ్రామానికి చెందిన కారుణ్య ట్రస్ట్ చైర్మన్ తుంగ నాగేశ్వరరావు శ్రీకాకుళం జిల్లాలోను తమ సేవా కార్యక్రమాలతో విశేష ఆదరణను పొందుతున్నారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో ఒక అభినందన కార్యక్రమం చేపట్టటానికి వచ్చిన కారుణ్య ట్రస్ట్ చైర్మన్ తుంగా నాగేశ్వరరావును స్థానికులు, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది ఆయనను ఆత్మీయంగా స్వాగతించారు. కోట బొమ్మాళి లో అన్ సంగ్ హీరో అవార్డు గ్రహీత రావాడ ఉమామహేశ్వరరావును తుంగ నాగేశ్వరరావు ఘనంగా సన్మానించి అభినందించారు. సేవ చేసే వ్యక్తులను గౌరవించే మనస్తత్వం ఆయనకు మంచి పరిచయం, ఆదరణ తీసుకొస్తున్నాయని కార్యక్రమం లో వక్తలు పేర్కొన్నారు..తనను కోటబొమ్మాళి వచ్చి సన్మానించినందుకు రావాడ ఉమామహేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

## అభివృద్ధి, సంక్షేమమే కూటమి లక్ష్యం

**మండల నాయకులు నారాయణరెడ్డి**



**నందవరం, ఆగస్టు 19 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలో ని హాలహర్వి గ్రామంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల నాయకులు రైస్ మిల్ నారాయణ రెడ్డి, గ్రామ అధ్యక్షులు ఎర్రన్న తెలిపారు. ఎమ్మెల్యే బీవీ నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జగన్నాథ్ రెడ్డి,టిడిపి మండల కార్యదర్శి ప్రభుదాసు,బూత్ కన్వీనర్ హరి కృష్ణ,టిడిపి నాయకులు బోయ ఎర్రం నాయుడు,బిజెపి మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు భీమయ్య,వెంకటేష్ రెడ్డి, సురేష్,చిన్న దావీదు,రాగప్ప,ఏసేపు,బుడ్డ రంగన్న, అంజి,ఆంధ్రయ్య,ఉరుకుంద,జి దుబ్బన్న, గొల్ల రవి రామకోటి,ఇమ్మానియేల్, గాలి సంసోను,కల్లు గోవిందు,ఆంజనేయులు, జయన్న కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌ను కలిసిన వంగా గీత



**కాకినాడ జిల్లా పిఠాపురం (ప్రజా జ్యోతి) :** వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పిఠాపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర పీఏసీ సభ్యురాలు వంగా గీతా విశ్వనాథ్ బుధవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వివరించారు. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలు తదితర అంశాలపై ఇరువురు చర్చించినట్లు తెలిపారు.

# ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిధిలో టీటీడీ మాజీ పాలక మండల సభ్యులు వై. సీతారామరెడ్డి, ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ప్రత్యేక పూజలు

భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న క్షేత్రం ఉరుకుంద
ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారికి మొక్కులు
వైభవంగా సాగిన పూజా కార్యక్రమాలు,
ఘన స్వాగతం పలికిన ఆలయ అర్చకులు, అధికారులు





**కౌతాళం, ఆగష్టు 19 ప్రజా జ్యోతి** మంత్రాలయం నియోజకవర్గం పరిధిలోని కౌతాళం మండలంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ లక్ష్మీ ఉరుకుంద ఈరన్న స్వామివారిని టీటీడీ మాజీ పాలక మండల సభ్యులు వై. సీతారామరెడ్డి, మంత్రాలయం శాసనసభ్యులు వై. బాలనాగిరెడ్డి బుధవారం రోజున దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వీరికి ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు,స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి, అశ్వత్థ వృక్షానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను నాయకులకు అర్చకులు అందజేసి వేదాశీర్వచనం అందించారు. నియోజకవర్గ ప్రజల క్షేమానికే పూజలు ఈ సందర్భంగా టీటీడీ మాజీ పాలక మండల సభ్యులు వై. సీతారామరెడ్డి, ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి మాట్లాడుతూ ఉరుకుంద ఈరన్న స్వామి ఆశీస్సులతో నియోజకవర్గంలోని ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండి రైతాంగం సంతోషంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తుల కొంగుబంగారమైన ఈరన్న స్వామి మహిమలు అనంతమని క్షేత్ర అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద ఆచారి వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి,అయ్యప్ప,వడ్డే రామన్న, ఆదినారాయణ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు,గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నందవరం ఎస్సైను సస్పెండ్ చేసి విచారణ జరపాలి

**ఇసుక అక్రమ రవాణా, గంజాయి వ్యవహారాలపై**
**తీవ్ర ఆరోపణలు.. ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్..**

**ఎమ్మిగనూరు, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** నందవరం మండలంలో ఇసుక అక్రమ రవాణా, గంజాయి వ్యవహారాలు, పోలీస్ స్టేషన్‌లో పంచాయితీల పేరుతో వసూళ్లకు సంబంధించి తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నందవరం ఎస్సై తిమ్మారెడ్డి అసాంఘిక శక్తులకు అండగా ఉంటున్నారంటూ పత్రిక ముఖంగా ద్వారా మాజీ టిడిపి కౌన్సిలర్ కోనేరు నాగేంద్ర ప్రసాద్ ఆరోపించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని ఆయన ఉన్నతాధికారులను కోరారు. ఇసుక అక్రమ రవాణాపై ఆరోపణలు నాగలదిన్నె నది పరిసరాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను ఇతర ప్రాంతాలకు, తెలంగాణ వైపు తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని నాగేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. రోజువారీగా అక్రమ రవాణాకు నిర్దిష్ట సంఖ్యలో వాహనాలకు అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు చేయాలని కోరారు. గంజాయి మాఫియాపై ఆరోపణలు నాగలదిన్నె ప్రాంతం గంజాయి అక్రమ రవాణాకు కేంద్రంగా మారుతోందని ఆయన ఆరోపించారు. ఇటీవల నాగలదిన్నె చెక్‌పోస్ట్ వద్ద గంజాయి పట్టుబడిన ఘటనను ప్రస్తావిస్తూ, సంబంధిత వ్యవహారంలో రాజకీయ జోక్యం జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. నాగలదిన్నె నుంచి కోస్గి, ఆదోని, మంత్రాలయం ప్రాంతాలతో పాటు కర్ణాటకకు కూడా గంజాయి సరఫరా జరుగుతోందని ఆరోపించారు. ఈ అక్రమ వ్యవహారాలకు కొందరు వ్యక్తులు, మధ్యవర్తులు, ఇతరులు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, వీటిపై పోలీసు ఉన్నతాధికారులు స్వతంత్రంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఫోటో ఆధారాలు ఉన్నాయంటూ వెల్లడి తాను చేస్తున్న ఆరోపణలకు సంబంధించిన ఫోటో ఆధారాలు తన వద్ద ఉన్నాయని నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. అవసరమైతే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఆరోపణలు నిజమో కాదో తేల్చేందుకు సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ నందవరం మండలంలో జరుగుతున్నట్లు చెబుతున్న అక్రమ కార్యకలాపాలపై తక్షణమే విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నాగేంద్ర ప్రసాద్ కోరారు. నందవరం ఎస్సై తిమ్మారెడ్డిని సస్పెండ్ చేసి విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.



# 547 సర్వే నంబర్లు వస్తున్న పద్ధతులను ఎవరు నమ్మవద్దు తాసిల్దార్ రమాదేవి

**గుంతకల్లు ఆగస్టు 19 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు లోని సర్వే నంబర్ 547 భూమి విషయంలో వస్తున్న వదతులను ఎవరు నమ్మవద్దని తాసిల్దార్ రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంతకల్లు లోని సర్వేనెంబర్ 547 లో 11 ఎకరాల వివిధ పేర్లతో మార్చి 26వ తేదీన 22ఏ కొరకు అప్లై చేయడం జరిగిందని, అప్పుడు వాటిని గమనించడం పై 547 లో 11 ఎకరాలు ఉన్నాయి అడిషనల్ గా 5 ఎకరాలు గమనించడం జరిగింది వెంటనే గుర్తించి గ్రౌండ్ లో ఉన్న దాని కన్నా ఐదు ఎకరాలు ఎక్కువగా ఉన్నదని గుర్తించి ఆధారఖాస్తు ను తిరస్కరించడం జరిగింది. ఎన్ఓసి తీసుకోవడానికి అర్హత లేదని దరఖాస్తులు తిరస్కరించడం జరిగింది. వెంటనే ఇది ఎలా నమోదు అయిందని తమ సిబ్బందిని కూడా హెచ్చరించడం జరిగిందని తాసిల్దార్ రమాదేవి పేర్కొన్నారు. ఈ విషయాన్ని మార్చిలో గమనించడం జరిగిందని అయితే ఏప్రిల్ లో కూడా సుమోటోగా కూడా వాటిని తొలగించాలని ఉద్దేశంతో ఉన్నంత అధికారుల కు రిపోర్టు పెట్టడం జరిగింది. ఆ తర్వాత పోలీస్ స్టేషన్లో కూడా ఎలా జరిగింది అనే విషయం గురించి పోలీస్ స్టేషన్లో కేసు పెట్టడం జరిగింది. ఈలోగా కొంత మంది ఆన్లైన్లో ఉన్న రైతులు పిజిఆర్ఎస్ అర్జీ ఇవ్వడం జరిగిందని, అదే ఆధారంగా విచారణ చేసి మేము జూలై మొదటి వారంలో నే ఈ అదనంగా ఉన్న దానిని తొలగించడం జరిగింది. వాస్తవంగా ఆన్లైన్లో వెబ్ ల్యాండ్ మేరకు సవరించడం జరిగింది. నేను గుంతకల్లు మండలం తో పాటు విడపనకల్లు మండలం లో ఇన్చార్జిగా చేయడం జరుగుతుంది. రెండు మండలాలు చూసుకునే వివిధ రకాల పనుల ఒత్తిడితో అలాగే ఏప్రిల్, మే నెలలో ఓటర్లు వెరిఫికేషన్ చేయడం జరిగింది. అదేవిధంగా మార్చి నుంచి జూలై మధ్యలో ఓటర్ లిస్టుల సర్వే మరియు పెట్రోల్ గ్యాస్ కొరతతో బిజీలో ఉన్నందున ఈ విషయం తెలుసుకోని వెంటనే అధికారుల ఆదేశాల మేరకు తొలగించడం జరిగింది. వాస్తవంగా ఎవరైనా అర్జీ దారుడు సచివాలయంలో అప్లై చేసుకుంటారు ఆ తర్వాత వీఆర్వోకు ఆ అర్జీ వీఆర్వో సంతకం చేసిన తర్వాత ఆర్ఐకు పంపించి ఆర్ఐ ప్రభుత్వం అయిన తర్వాత తాసిల్దార్ అనే నాకు వస్తుంది నేను పరిశీలించి అర్జీదారులకు ఇవ్వడం జరుగుతుంది,కానీ ఈ విషయంలో అయితే ఫిజికల్ గా కూడా సచివాలయంలో కూడా అప్లై కాలేదు వీఆర్వో, ఆర్ఐ, నాకు తెలియకుండానే ఈ విషయాలు జరిగినాయని పోలీసు వారి దృష్టికి తీసుకువెళ్లి కేసు కూడా పెట్టడం జరిగింది. అయితే ఈ విషయంలో ఉన్న జిల్లా ఉన్నంత అధికారులు కూడా స్పందించి ఈ విషయంలో ఎవరైతే ఉన్నారో తెలుసుకొని వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తాసిల్దార్ రమాదేవి తెలిపారు. కావున ఎవరైనా కూడా ఈ విషయంలో వస్తున్న వదతులు నమ్మవద్దని ఆమె తెలిపారు.



# స్వచ్ఛ ఆటో కార్మికుల డిమాండ్

**మేడ్చల్ :** కాప్రా లోస్వచ్ఛ ఆటో కార్మికుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రజల ఇళ్ల నుంచి ప్రతిరోజూ చెత్తను సేకరిస్తూ నగర పారిశుద్ధ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్?2026 అమలుపై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రాంకీ సంస్థను వెంటనే రద్దు చేసి కార్మికుల ఉద్యోగ భద్రతను కాపాడాలని కోరుతున్నారు.ప్రజల ఇళ్ల నుంచి నిత్యం చెత్తను సేకరిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న స్వచ్ఛ ఆటో కార్మికులు తమ సమస్యలను ప్రత్యేక లా కమిషన్ ను ఏర్పాటు చేసి ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతున్నారు.స్వచ్ఛ ఆటో కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు.. వారి కుటుంబాల జీవనోపాధి, పిల్లల విద్య, సామాజిక భద్రత వంటి అంశాల పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం ఎౌచిఓ నిబంధనలు 2006 ద్వారా నోటిఫై చేసిన నేపథ్యంలో ఈ నిబంధనలను శాస్త్రీయంగా, సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని కార్మికులు చెబుతున్నారు అయితే ఎౌచిఓ ఖీబీశ్రీవబ?2026 అమలును సాకుగా చూపి.. తమ ఉపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్వచ్ఛ ఆటో కార్మికులు కోరుతున్నారు.రాంకీ సంస్థకు పగ్గాలు అప్పగించి తమ బ్రతుకును కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు వెంటనే రాంకీ ను రద్దు చేసి కార్మికుల ఉద్యోగ భద్రతను కాపాడాలని కోరుతున్నారు.స్వచ్ఛ నగర నిర్మాణంలో కీలకంగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత, సంక్షేమం కల్పించడంతో పాటు.. ఎౌచిఓ ఖీబీశ్రీవబ?2026 అమలుపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని స్వచ్ఛ ఆటో కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు రూ. 3,77,051 విలువైన ఎల్ఓసి లెటర్ అందజేత



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 19 (ప్రజా జ్యోతి)** బద్వేలు మున్సిపాలిటీ పరిధి లోని 22వ వార్డుకు చెందిన బయ్యారపు చెన్నమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం కావాలని ఆమెకు మారుడు బయ్యారపు ప్రసాద్, వార్డు ఇంచార్జ్ మాచుపల్లి లక్ష్మీదేవి ద్వారా బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డిని సంప్రదించారు దీనికి ఆయన వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 3,77,051 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసి) మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు. మంజూరైన ఎల్ఓసి లెటర్‌ను మంచూరు సూర్యనారాయణ రెడ్డి స్వయంగా చెన్నమ్మ కుమారుడు బయ్యారపు ప్రసాద్‌కు అందజేశారు.ఆపద సమయంలో తమకు అండగా నిలిచి, వైద్య చికిత్సకు భారీ ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్ బాబుకు, బద్వేలు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డికి, అలాగే తమకు సహకరించిన వార్డ్ ఇంచార్జ్, బద్వేల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మాచుపల్లి లక్ష్మీదేవికి బయ్యారపు ప్రసాద్ తో పాటు వారి కుటుంబ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# కెసి కెనాల్ కింద ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోండి

- ఏవో అమర్ నాథ్ రెడ్డి



**దువ్వూరు,ఆగస్టు 19 ( ప్రజా జ్యోతి )** మండల పరిధిలోని మాచన పల్లె గ్రామంలో బుధవారం ఏవో అమర్ నాథ్ రెడ్డి పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో కేసీ కెనాల్ కింద ప్రత్యామ్నాయ పంటలు అనగా ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ముఖ్యంగా మినుము ల,పెసర,జొన్న మొదలైన పంటలు సాగు చేసుకోవాలని తెలియజేశారు. భూమి ఉన్న ప్రతి రైతు 11 అంకెల రైతు విశిష్ట సంఖ్య కలిగి ఉండాలని ప్రభుత్వం సంక్షేమం పథకాల వర్తించాలన్న ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా డిఎపి పొందాలన్నా పంటల బీమా నమోదు చేసుకోవాలన్న పంట ఉత్పత్తులు కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలన్న ఈ సంఖ్య తప్పనిసరిగా ఉండాలని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు గ్రామ వ్యవసాయ సహాయకురాలు పాల్గొన్నారు.

# 34 శాతం బీసీ రిజర్వేషన్లపై హర్షం వ్యక్తం చేసినబీసీ రాష్ట్ర కార్యదర్శి శీలం భాస్కర్ నాయుడు,



**డోన్ ( ప్రజా జ్యోతి )ఆగస్టు 19** నంద్యాల జిల్లా డోన్ టౌన్ నందుస్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బుధవారం డోన్ ఆఫీస్ నందు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శీలం భాస్కర్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు ఆయన మాట్లాడుతూ. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేలా మంత్రి మండలి తీర్మానం చేయడం సంతోషకరమన్నారు. సుప్రీంకోర్టు నిబంధనల నేపథ్యంలో మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే బీసీలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని తెలిపారు. విద్య, ఉద్యోగ రంగాలతో పాటు రాజకీయ రంగంలోనూ బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఘనముద్దయ్య, నంద్యాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం లీగల్ అడ్వైజర్ కృష్ణమూర్తి, బాలకృష్ణ, గోసానిపల్లె తిమ్మయ్య తదితరులు బీసీ నాయకులుపాల్గొన్నారు.



# మహిళలకు స్ఫూర్తినిస్తుంది

'అమీర్‌లోగ్' చిత్రంలో తాను పోషించిన పాత్ర మహిళలకు స్ఫూర్తినిచ్చేలా ఉంటుందని చెప్పింది కథానాయిక వేదా జలంధర్. హైదరాబాద్ బస్తీ నేపథ్య కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రానికి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ నెల 21న రానా 'స్పిరిట్' మీడియా ద్వారా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర కథానాయిక వేదా జలంధర్ పాత్రికేయులతో ముచ్చటించింది. ఈ సినిమాలో తాను పక్కింటి అమ్మాయి తరహా పాత్రలో కనిపిస్తానని, ముక్కసూటిగా మాట్లాడటం తన నైజమని చెప్పింది. 'ఈ సినిమా రిలీజైన తర్వాత ప్రతీ ఒక్కరూ నా పాత్ర గురించి మాట్లాడుతారు. హైదరాబాద్ నేటివిటీని ప్రతిబింబించే అద్భుతమైన కథ ఇది. ప్రతీ పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి ఆరేళ్లయింది. 'అమీర్‌లోగ్' తప్పకుండా నా కెరీర్‌కు బ్రేక్‌నిస్తుందనే నమ్మకం ఉంది' అని వేదా జలంధర్ తెలిపింది

# మోడ్రన్ మిస్సమ్మ కథ



హర్ష నర్రా, తన్మయి, ఖుషి, సిజు ఏఆర్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మోడ్రన్ మిస్సమ్మ'. సాయిబాబా దర్శకుడు. లాస్య అండ్ మిథున క్రియేషన్స్ తెరకెక్కిస్తున్నాయి. బుధవారం ఈ సినిమాలోని 'బెటర్ బీ ఏ మిస్సమ్మ' అనే తొలిపాటను విడుదల చేశారు. గోపీ సుందర్ స్వరపరచిన ఈ పాటను కిట్టు విస్సాప్రగడ రచించారు. 'కథపై నమ్మకంతో ఈ సినిమాకు 'మోడ్రన్ మిస్సమ్మ' అనే టైటిల్ పెట్టాం. పెళ్లి నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగే చిత్రమిది. వినోదానికి పెద్దపీట వేశాం' అని దర్శకుడు తెలిపారు. నేటి ట్రెండ్‌కు తగిన సినిమా ఇదని నిర్మాత చిరంజీవి పమిడి పేర్కొన్నారు.కొ




# అక్కినేని త్రయం అదరగొట్టే లుక్స్..

## 'వెరైటీ ఇండియా' మ్యాగజైన్ కవర్‌పై నాగ్, చైతూ, అఖిల్!

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం (అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్) తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. అతి త్వరలో రాబోయే ఈ ప్రత్యేక సంచిక కోసం అక్కినేని హీరోలు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూలో వారు సినిమా రంగంలో తమ కుటుంబం సాధించిన అరుదైన విజయాలు, తొమ్మిది దశాబ్దాల సినీ ప్రయాణం, నాటి అనుభవాలు మరియు నేటి తరానికి సంబంధించిన ఆసక్తికరమైన విశేషాలను పంచుకున్నారు. అత్యంత ఆకర్షణీయమైన దుస్తుల్లో, స్టైలిష్ అప్పియరెన్స్‌తో ఉన్న ఈ అక్కినేని హీరోల ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# వెంకటేశ్-కల్యాణ్‌రామ్ మూవీకి క్రేజీ టైటిల్.. 'జనవరి 12 విడుదల'

అనిల్ రావిపూడి ప్రమోషన్స్ అంటే మామూలుగా ఉండవు..తన సినిమాల ప్రచారంలోనూ కొత్తదనం చూపించే ఆయన.. తాజాగా మరోసారి తనదైన స్టైల్‌లో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ కీలక పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమాకు టైటిల్ ప్రకటించే విషయంలోనూ ఓ ఫన్నీ ఐడియాను తీసుకొచ్చారు. టైటిల్‌తో పాటు సినిమా విడుదల తేదీని కూడా ఒకేసారి రివీల్ చేసి ఆసక్తి పెంచారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ హీరోలుగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కీర్తి సురేశ్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ బావా బామ్మర్ది పాత్రల్లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా చిత్రబృందం సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించింది. 'జనవరి 12 విడుదల' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసింది. అంతేకాదు.. 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే క్యాప్షన్‌ను కూడా జత చేసింది. టైటిల్ వినగానే ఇది సినిమా విడుదల తేదీ అనుకుంటే.. అదే సినిమా పేరుగా ఉండటం విశేషం. టైటిల్ ప్రకటన కోసం రూపొందించిన వీడియోలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతి శెట్టి.. అనిల్ రావిపూడిని సినిమా పేరేంటని అడుగుతారు. అందుకు ఆయన పదే పదే 'జనవరి 12 విడుదల' అని చెబుతుంటారు. తొలుత అది రిలీజ్ డేట్ అని భావించిన హీరోలు.. చివర్లో అదే సినిమా టైటిల్ అని తెలుసుకుని సరదాగా స్పందిస్తారు. టైటిల్ రివీల్ వీడియోలో దర్శకుడు అనిల్ రావిపూడి ప్రముఖ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు ప్రత్యేకంగా నివాళి అర్పించారు. ఈవీవీ తెరకెక్కించిన 'అప్పుల అప్పారావు'లోని కామెడీ సీక్వెన్స్‌ను గుర్తు చేసేలా వీడియోను రూపొందించారు. ఇలా తన కామెడీ మార్క్‌తో పాటు పాత తరం హాస్యాన్ని కలిపి టైటిల్ అనౌన్స్‌మెంట్‌ను కూడా ఓ ఎంటర్‌టైనింగ్ వీడియోగా మార్చారు.




Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,